
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 24 డిసెంబరు 2024 | 5

నేటి నుంచి ప్రసన్న వేంకటేశ్వరుడి
బ్రహ్మోత్సవాలు





విద్యుత్ కాంతుల్లో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

బిక్కవోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రెండో తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి రెండో ఏట బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి తెలిపారు. 2012లో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి 2014లో తిరుపతి నుంచి స్వామి వారి విగ్రహం రప్పించి ప్రతిష్ఠించామన్నారు. ఈ ఆలయంలో తిరుమలలో వలే స్వామి చెంతనే కోనేరు, వరాహస్వామి ఆలయ నిర్మాణాలకు రూ. 15 కోట్లు వ్యయం అయ్యిందని తెలిపారు. ప్రతి శనివారం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తున్నామన్నారు. ఈ నెల 24 నుంచి జనవరి 2 వరకూ స్వామి వారి ద్వితీయ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన మల్లిడి పెదిరెడ్డి 5 కిలోల వెండితో తయారు చేసిన శేష పానుపును బహూకరించారన్నారు.ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు రూ.20 కోట్లు వ్యయం అంచనా వేస్తున్నామని ఆలయ చైర్మన్ గంగారెడ్డి వివరించారు.



దివ్యాంగుల వద్దకే వచ్చి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి
72 గంటలు
కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మన వద్దకు వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని 48 గంటల నుంచి 72 గంటల వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఇతర శాఖలకు సంబంధించిన వాటిని 24 గంటల్లో ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న కలెక్టర్ తొలుత కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై తీసుకోవాల్సిన చర్యలు, అర్జీదారుడికి స్లిప్ జారీ చేయడం, పీజీఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేయడం మొదలుకొని ఏ అధికారి వద్దకు వెళ్లాలో సూచనలు చేయాలని సిబ్బందికి సూచించారు.అనంతరం కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దివ్యాంగుల చెంతకు వెళ్లి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు.ప్రతి వారం రాష్ట్రస్థాయిలో జిల్లాకు సంబంధించి పీజీఆర్ఎస్‌పై సమీక్ష జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు వివిధ శాఖలకు సంబంధించి 172 అర్జీలు చూడాల్సిందన్నారు. కలెక్టర్ ,జేసీ ,డీఆర్వో 137 అర్జీలు స్వీకరించారు.

పోలీసులకు 26 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ 26 అర్జీలు స్వీకరించారు.ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

నౌ..కాకినాడ.. ఈ టైమ్ కాకినాడది.. అవును మరి నిజమే.. ఎందుకంటే షిప్ తయారీ కేంద్రంగా మారనుంది.. ఆ కేంద్రం అంటే మాటలా.. మన రాష్ట్రంలో ఒక్క విశాఖలో మాత్రమే ఉంది.. ఇప్పుడు కాకినాడలోనూ అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. ఈ నేపథ్యంలో ఆ కేంద్రానికి కాకినాడ అనుకూలంగా ఉంటుందని ప్రతిపాదనలు పంపారు. దీంతో కాకినాడ టైం నేడో రేపో మారనుంది.. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు..





కాకినాడలో తయారైన భారీ షిప్.. నిర్మాణంలో ఉన్న మరో ఓడ

నౌ..కాకినాడ!

మారిటైం బోర్డు పాలసీతో తిరగనున్న దశ

- షిప్‌ల నిర్మాణానికి అనువుగా కాకినాడ
- షిప్ బిల్డింగ్ సెంటర్‌కు ప్రతిపాదన
- సుదీర్ఘ సీఫ్రంట్‌తో ప్రయోజనం
- పలు కంపెనీలూ ఆసక్తి
- గతంలో కరువైన వైసీపీ ప్రోత్సాహం
- మూడు కంపెనీలు వెనక్కు
- ఈసురోమన్న నౌకా నిర్మాణ రంగం
- కూటమితో చిగురిస్తోన్న ఆశలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

షిప్‌ల తయారీ రంగానికి కేంద్రంగా కాకినాడను తీర్చిదిద్దేలా అడుగులు పడుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకా నిర్మాణ క్లస్టర్ల ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో కాకినాడలో వీటి తయారీ భవిష్యత్తులో భారీగా పుంజుకోబోతోంది. అటు రూ.300 కోట్లతో చిన్న, మధ్యతరహా నౌకల నిర్మాణానికి వీలుగా షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్ముందు కాకినాడలో చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌ల తయారీకి ఊతం లభించనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మారిటైం పాలసీ కింద నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించడం, అటు మారిటైం బోర్డు కార్యాలయం సైతం ఇక్కడే ఉండడంతో కాకినాడ దశ తిరగనుంది.

కాకినాడకు ఎప్పటి నుంచో పేరు..

విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డు మినహా రాష్ట్రంలో నౌకల నిర్మాణం ఇంకెక్కడా లేదు. కానీ వీటి తయారీకి అత్యంత అనువైన వాతావరణం కాకినాడలోనే ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. వాస్తవానికి సుదీర్ఘ సాగర తీరం..దాన్ని ఆనుకుని యాంకరేజ్ పోర్టు వెంబడి వందల ఎకరాల భూములు ఉన్నాయి. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి ఆ పక్కనే ఉన్న సముద్రజలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేస్తారు. ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. వీటిని పోర్టు అధికారులు లీజుకు ఇస్తారు. ఇందులోనే శాన్ మెరైన్ ఏటా 20 వరకు చిన్నతరహా ఓడలను తయారుచేస్తోంది. అయితే కొత్త పాలసీ కింద కంపెనీలు వస్తే భవిష్యత్తులో నగరం నౌకల తయారీకి ప్రసిద్ధి చెందనుంది. అటు అధికారులు కొత్త నౌకా నిర్మాణ కేంద్రం ఈ ప్రాంతంలోనే అనువుగా ఉంటుందని తాజాగా గుర్తించారు.

నాడు పట్టించుకోని వైసీపీ

కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఒక్కటే ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది ఏకంగా 8 వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐదేళ్లలో మరో 25 వరకు నౌకలను నిర్మించి దేశవ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవు తోంది. మేట్ మెరైన్ అనే కంపెనీ పది ఎకరాల్లో వీటి తయారీకి సిద్ధమైనా గత ప్రభుత్వ ప్రోత్సాహం కరువై పక్కకుపోయింది. కేంద్రం ఒక పక్క రాయితీలు ప్రకటిస్తున్నా గత వైసీపీ సర్కారు మాత్రం ఈ రంగాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మారిటైం పాలసీని ప్రకటించడంతో ఈ రంగం పుంజుకోవడానికి అవకాశం ఏర్పడింది. ప్రధానంగా నౌకల తయారీ క్లస్టర్లకు ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించడంతో ఇప్పుడు కంపెనీలు దృష్టిసారించి కాకినాడకు రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అటు పాలసీ అమలుకు ఏపీ మారిటైం బోర్డును నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఈ కార్యాలయం కాకినాడలో ఉండడంతో భవిష్యత్తులో నౌకా నిర్మాణం పుంజుకోవడానికి అడుగులు పడుతున్నాయి. రూ.300 కోట్లతో ఇక్కడ నౌకా తయారీ కేంద్రం ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే భారీ పెట్టుబడులు రానున్నాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఉన్న హిందుస్థాన్, కొచ్చిన్, గోవా, మజ్‌గావ్ షిప్ యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి. కాకినాడలో ఐదెకరాల విస్తీర్ణంలోనే భారీ నౌకల తయారీకి సహజసిద్ధ సీఫ్రంట్ వాతావరణం అనుకూలంగా ఉంది. కానీ ప్రోత్సాహం లేక పెట్టుబడులు రాలేదు. నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించడంతో కాకినాడ కేంద్రంగా ఈ రంగం ఎదిగేలా చేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

వచ్చి.. వెళ్లిపోయాయి..

గతంలో కాకినాడలో నౌకల నిర్మాణం, మరమ్మతులకు షిప్‌యార్డును నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వహించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. కానీ సరైన ప్రోత్సాహం కరువవడంతో ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్ అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్ యార్డు నిర్మాణానికి ముందుకు వచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో చెన్నైకు వెళ్లిపోయింది. మరోపక్క 2020లో రూ.7కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు. ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో అది ఈసురోమంటోంది.

28 వరకు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపికకు సంబంధించిన కార్యాచరణ ప్రక్రియను ఈనెల 30న తేదీ ప్రకటించడం జరుగుతుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నైపుణ్యం కల్గిన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 28వ తేదీతో ముగుస్తుందన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కన్వీనర్ శ్యాం గంగరాజు, కమిటీ సభ్యులు కాలెపు సత్యసాయిరాం, పల్లా రాంజీ సెల్ నెం. 92994 01222, 63031 39365, 77801 67625 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

జీజీహెచ్ హెల్ప్ డెస్క్‌లో ఇద్దరు సిబ్బంది విధులు
'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని మెయిన్ బ్లాక్ ప్రవేశం వద్ద ఉన్న హెల్ప్ డెస్క్‌లో ఇద్దరు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని ఆర్ఎంవో, డిప్యూటి సూపరింటెండెంట్ దీన్ని పర్యవేక్షిస్తున్నారని ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. "సిబ్బంది ఉండరు ... హెల్ప్ చేయరు" శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ స్పందించారు. రోగుల సౌకర్యార్థం మెయిన్ బ్లాకు వద్ద ఒకటి, ఎంసీహెచ్ బ్లాకులోని గర్భిణీల విభాగంలో మరొకటి మొత్తం రెండు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోగులకు అసౌకర్యం కలగకుండా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ హెల్ప్ డెస్కులో సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు.



పెరవలి స్టేషన్ వద్ద మొక్క నాటుతున్న ఎస్పీ

ఇసుక అక్రమ రవాణా చేస్తే
కఠిన చర్యలు
ఎస్పీ నరసింహకిశోర్

పెరవలి/నిడదవోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహకిశోర్ హెచ్చరించారు. పెరవలి, నిడదవోలు మండలం సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ రికార్డులను సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఇసుక ర్యాంపుల్లో దళారులపై చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వ్యాపారం చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్సు లేని ఏజెంట్ల వలకు చిక్కుకుని మోసపోతున్నారన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో క్రైమ్ రేటు తగ్గిందని మిగిలిన చోట్ల కూడా క్రైమ్ రేటు తగ్గే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.పెరవలి పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఆయన వెంట కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, నిడదవోలు సీఐ తిలక్, పెరవలి, ఉండ్రాజవరం ఎస్ఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఎస్పీ సీఐ అనసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మా భూమెక్కడ!
148 గ్రామాలు..1645 అర్జీలు

- తప్పుల తడకగా జగనన్న భూసర్వే
- ఆన్‌లైన్‌లో భూమి మాయం
- సరిహద్దుల్లోనూ తేడాలు
- రైతుల మధ్య భూ చిచ్చు
- లబోదిబోమంటున్న రైతాంగం
- రెవెన్యూ సదస్సులకు భారీ క్యూ



దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న రైతు

గోకవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నా భూమి ఎక్కడుందో చూపండి.. ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు.. ఎటుపోయిందో వెతికిపెట్టండి.. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులకు వస్తున్న చాలా ఫిర్యాదులు ఇలాగే ఉంటున్నాయి. గత వైసీపీ పాలనలో భూముల రీ సర్వేలో జరిగిన అక్రమాలు, తప్పులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. భూముల విస్తీర్ణం తగ్గిపోవడం, తమ భూములను ఇతర రైతుల పొలాల్లో చేరిపోయాయంటూ రైతులు అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరగని న్యాయం కూటమి ప్రభు త్వంలో జరుగుతుందని బాధిత రైతాంగం దరఖాస్తులు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సులకు తరలివస్తున్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 148 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 1645 అర్జీలను స్వీకరించారు. ఒక్క గోకవరం మండలంలోనే ఇప్పటి వరకు 7 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా వివిధ సమస్యలపై రైతుల నుంచి 104 అర్జీలు అధి కారులకు అందాయి.ఇంకనూ 8 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉంది. అధికారులకు అందిన 104 ఫిర్యాదుల్లో భూమి హెచ్చు తగ్గులు, సర్వే నెంబర్లు మారిపోవడం, తదితర ఇబ్బందులపై అందిన ఫిర్యాదులే అధికం. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. నల్లజర్ల రెవెన్యూ సదస్సులో 22 మంది అర్జీలు అందజేశారు. కోరుకొండ మండలం జంబూపట్నంలో 10 ఫిర్యాదులు అందాయి. వారసత్వంగా దశాబ్దాలుగా అనుభవిస్తున్న భూముల కొలతల్లో తేడాలు రావడం, అనుభవం కింద ఉన్న భూమిని ఇతరుల పేరిట రికార్డుల్లో చూపడం వంటి అంశాలు కూడా రైతుల మధ్య చిచ్చు పెట్టే విధంగా మారాయి. వారసత్వంగా వచ్చిన, కొన్న భూములు సాగు చేసుకొంటూ ప్రశాంతంగా జీవిస్తుంటే రీసర్వే పేరిట తాము పొలం వద్ద లేకున్నా సర్వే చేసి రాళ్లు పాతడం, భూమి రికార్డుల్లో కన్నా తక్కువగా చూపడం వంటి అక్రమాలకు గత వైసీపీ ప్రభుత్వ హ యాంలో పలువురు రెవెన్యూ సిబ్బంది తెరలేపారని పలువురు బాధిత రైతులు వాపోతున్నారు.

అవినీతికి ఊతం..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రీ సర్వే కొంతమంది రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం కురించిందనే ఆరోపణలు ఉన్నాయి. పొలంలోకి వెళ్లకుండానే గ్రామాల్లో ఏదో ఒక చోట కూర్చొని సర్వే చేసినట్టు చూపించి, ఆ తరువాత కావాలనే తప్పుడు కొలతలు వేశారనే విమర్శలు లేకపోలేదు.ఈ క్రమంలో బాధిత రైతుల ఆందోళన,ఆవేదనను కొంతమంది సిబ్బంది ముందుగా క్యాచ్ చేసి.. ఆ తరువాత క్యాష్ చేసుకున్నారనే అపవాదులు గట్టిగా వినిపిస్తున్నాయి. రికార్డులో ఉన్న తప్పులను తిరిగి వారే పరిష్కరించి రైతుల నుంచి భారీగా దోచుకుంటున్నారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికీ ఈ తతంగం కొనసాగుతూనే ఉన్నట్టు భోగట్టా. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ఇద్దరు, ముగ్గురు వీఆర్వోల పాత్ర ఉన్నట్టు సమాచారం. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



రాజమహేంద్రవరంలో ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి
ఎంపీ పురందేశ్వరికి సంఘం నాయకుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించడంపై సీఎం చంద్రబాబుతో మాట్లాడతానని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఏపీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్, ఉద్యోగాలు కోల్పోయిన ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ పురందేశ్వరిని సోమవారం రాజమహేంద్రవరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలు పోవడంతో వందల మంది హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉద్యోగాలు పోయిన బాధతో నాలుగు రోజుల వ్యవధిలో ముగ్గురు చనిపోయిన విషయాన్ని వివరించామన్నారు. దీనిపై స్పందించిన పురందేశ్వరి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారని వెల్లడించారు.

రైతులను గౌరవంగా చూడండి
రైతు దినోత్సవంలో కేవీకే హెడ్ నాయుడు

రాజానగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ అభివృద్ధిలో రైతులు కీలకపాత్ర పోషిస్తున్నారని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పేర్కొన్నారు. కలవచర్ల కేవీకేలో సోమవారం జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.దేశ శ్రేయస్సుకు రైతులు పునాది అన్నారు. రైతులను ప్రతి ఒక్కరూ గౌరవంగా చూడాలన్నారు.ఉద్యాన పంటల అధికారి జేవిఆర్ సత్యవాణి వ్యవసాయ శాస్త్రవేత్తల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతుల శ్రమ దేశాన్ని పోషిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెడుతుందన్నారు.ఇది ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. అన్నం పెట్టే రైతన్న లేకపోతే ఆకలి తీరదన్నారు. అన్నదాత ఆరుగాలం కష్టపడి తేనే మన కడుపు నిండుతుందని తెలిపారు.రైతు కుటుంబంలో పుట్టడం ఈ ప్రాంత యువత చేసుకున్న అదృష్టమన్నారు. రైతు సేవకు గుర్తింపుగా చల్లా నాగన్న అనే అభ్యుదయ రైతును సత్కరించారు.ఈ సందర్భంగా హాజరైన రైతులకు కృషి విజ్ఞాన కేంద్రంలో నువ్వుల పంట సాగుపై శిక్షణ ఇచ్చారు. ప్రత్యామ్నాయ పంటలే లాభదాయకంగా ఉంటాయన్నారు.రాజానగరంలోని దివ్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల విద్యా ర్థులు క్షేత్ర ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన విభాగం అధికారి సంజయ్ హెగ్డే, చేపల విభాగాధికారి రవీంద్ర పొంటక్కే, కేవీకే పశుసంవర్థక అధికారి బి.నాగేశ్వరరెడ్డి, సస్య రక్షణ అధికారి రఘునందన్, జిల్లా వ్యాప్తంగా మండలాల నుంచి రైతులు హాజరయ్యారు.



లే నాన్నా.. వెళ్లిపోదాం!
తల్లి కళ్లెదుటే కుమారుడి మృతి 7

దంత వైద్యులకు పుట్టిల్లు భారత్
జీఎస్‌ఎల్‌లో ఎంపీ పురందేశ్వరి

క్రిస్మస్ స్టార్ స్వాగతం!

ఏలేశ్వరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ మందిరాలు సిద్ధమవుతున్నాయి. క్రైస్తవులు తమ గృహాలను సుందరంగా తీర్చిదిద్దుకుంటున్నారు. క్రీస్తు దివినుంచి భువికి ఉద్భవించినందుకు సూచనగా క్రైస్తవులు తమ గృహాలను, ప్రార్థనా మందిరాలను స్టార్‌లతో తీర్చిదిద్దుతున్నారు. ఇందులోభాగంగా కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఆర్‌సీఎం చర్చిగేటు వద్ద నక్షత్రాల (స్టార్) మధ్యలో పశువులపాకలో క్రీస్తు జననం దృశ్యం ఎందరినో ఆకట్టుకుంటోంది.



ఏలేశ్వరంలో ఓ చర్చి వద్ద విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంటూ స్వాగతం పలుకుతున్న క్రిస్మస్ స్టార్

శాంతా క్లాజ్‌ల నృత్యాలు



అనపర్తిలో శాంతాక్లాజ్‌ల వేషధారణలో నృత్యం చేస్తూ ఆకట్టుకుంటున్న చిన్నారులు

అనపర్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకల సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో సోమవారం శాంతా క్లాజ్‌లు సందడి చేశారు. అనపర్తిలోని శిలువలమ్మ చర్చి, బాప్టిస్టు చర్చిల ఆధ్వర్యంలో శాంతా క్లాజ్‌ల వేషధారణలతో చిన్నారులు గ్రామంలో పర్యటించి సందడి చేశారు. ప్రధాన కూడళ్లలో డ్యాన్స్‌లు వేస్తూ చిన్నారులకు బహుమతులు అందించారు. ప్రపంచంలో ప్రజలంతా ఆనందంగా జీవించాలన్న ఆకాంక్షతో శాంతిని నింపాలన్నదే తమ లక్ష్యమని శాంతాక్లాజ్‌లు పేర్కొన్నారు.

130ఏళ్ల లూథరన్ చర్చి

జగ్గంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట పట్టణంలో ఈ లూథరిన్ చర్చికి 130ఏళ్ల చరిత్ర ఉంది. క్రిస్మస్ సందర్భంగా ప్రస్తుతం ఈ చర్చి విద్యుత్ అలంకరణలో వేడుకలకు సిద్ధమైంది. 1890లో ఈ లూథరిన్ చర్చిని అప్పటి బ్రిటీష్ వారు ఐదుగురు క్రైస్తవులతో కలిసి ఏర్పాటు చేశారని, ప్రస్తుతం 1200మంది ఇక్కడకు ప్రార్థనకు వస్తున్నారని సంఘ పెద్దలు తెలిపారు. క్రిస్మస్ పండుగ వచ్చేసరికి మెట్ట ప్రాంతంలో ఈ చర్చికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ప్రస్తుతం రంగురంగుల విద్యుత్ దీపాలతోపాటు సంఘ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.



విద్యుత్ దీపాలతో జగ్గంపేటలోని సెయింట్ లూథరన్ చర్చి

మార్కెట్‌లో.. క్రిస్మస్ సందడి

- వివిధ శ్రేణుల్లో వస్తువుల ధరలు
- నక్షత్రాలు రూ.10- రూ.500 వరకు..
- క్రిస్మస్ ట్రీలు రూ.35-రూ.2500 వరకు..
- డెకరేషన్ వస్తువులు రూ.75-రూ.వెయ్యి వరకు..

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలు నెలరోజులుగా ప్రారంభమయ్యాయి. మార్కెట్‌లో క్రిస్మస్ సందడి మొదలైంది. విద్యుత్ బల్బులు, అలంకరణ సామాగ్రి కనువిందు చేస్తున్నాయి. క్రైస్తవులు వివిధ వస్తువులను కొనుగోలు చేసి గృహాలను అలంకరించుకోవడంలో నిమగ్నమవుతున్నారు. నక్షత్రాలు రూ.10 నుంచి రూ.500 వరకు, క్రిస్మస్ ట్రీలు సైజును బట్టి రూ.35 నుంచి రూ.2500 వరకు ధర పలుకుతున్నాయి. శుభాకాంక్షలతో కూడిన తోరణాలు రూ.25నుంచి రూ.100 వరకు అమ్ముతున్నారు. డెకరేషన్ వస్తువులు అయితే రూ.75నుంచి రూ.1000కు దొరుకుతున్నాయి. క్రిస్మస్ తాత డ్రెస్ రూ.275 నుంచి రూ.750 వరకు విక్రయిస్తున్నారు. క్రీస్తు ఫోటోలు, థర్మకోల్ షీట్లు, క్రిస్మస్ తాతల రూపాలను మార్కెట్‌లో అమ్ముతున్నారు. పలు రకాల క్రిస్మస్ గిఫ్ట్‌లను రూ.50 నుంచి రూ.2వేల వరకు అమ్ముతున్నారు. వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు జిల్లాలో క్రైస్తవులంతా సిద్ధమవుతున్నారు. వస్తువుల ధరలు పెరిగినా కొనడానికి మక్కువ చూపుతున్నారు. గిరాకీ బాగుందని వ్యాపారులు చెపుతున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చర్చిలను ముస్తాబు చేశారు. కాంతులీలుతున్న విద్యుత్‌దీపాలు, రంగుల బల్బులు, నక్షత్రాలు, క్రిస్మస్ ట్రీలతో అలంకరించారు.



తళుకుబెళుకులతో ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీలు



ప్రత్యేక ఆకర్షణగా ఉన్న మేరీ క్రిస్మస్ స్ట్రిప్‌లు.. శాంతా క్లాజ్ మాస్క్‌లు



వివిధ రంగుల్లో లభ్యమవుతున్న నక్షత్రాలు

సేవలో ఆధ్యాత్మికం

- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన పిఠాపురం ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి



పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శతాబ్దానికి పైగా తన ప్రత్యేకతను చాటుకుంటోంది పిఠాపురంలోని పురాతనమైన చర్చి. ఈ చర్చి ఉన్న ప్రాంతాన్నే చర్చి సెంటర్‌గా వ్యవహరించడం దానికున్న ప్రాధాన్యతను చాటి చెబుతోంది. 119 ఏళ్ల క్రితం కెనడియన్లతో స్థాపించిన ఈ చర్చిలో ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరంతోపాటు క్రైస్తవ పండుగలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

జిల్లాలో అతిపురాతనమైన చర్చిల్లో ఒక్కటిగా, శతాధిక వసంతాలు చరిత్ర కలిగి పిఠాపురం పట్టణంలో ఉన్న ఆంధ్రాబాపిస్టు సెంటినరీ చర్చికి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రం నుంచే గాక దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు ఈ చర్చికి వస్తూ ఉంటారు. 1905లో కెనడియన్ మిషనరీకి చెందిన ఈజే స్మిత్ ఈ చర్చిని స్థాపించారు. 1974 వరకూ ఈ చర్చి కెనడియన్స్ నేతృత్వంలోనే కొనసాగింది. ఈ చర్చిలో క్రైస్తవ ప్రార్థనలతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చర్చి ద్వారా పింఛన్లు పంపిణీ చేయడంతోపాటు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు సేవలందిస్తున్నారు. ప్రతిఏటా క్రిస్మస్ సందర్భంగా చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి ఆదివారం పిల్లలు కోసం సండే స్కూల్, యువజన సహవాసం, ఆరాధనలు జరుగుతాయి. 1954 నుంచి64 వరకూ నిమితే జాన్, 1972 వరకూ సువర్ణ రాజు చర్చి పాస్టర్లుగా వ్యవహరించారు. ప్రస్తుతం చర్చి అధ్యక్షుడిగా గుబ్బల సాల్మన్‌రాజు, చర్చి సంఘ కాపరులు(పాస్టర్లు)గా బి.థియోఫిలాస్ ఉన్నారు. క్రిస్మస్ వేడుకలకు ఈ చర్చి ముస్తాబైంది. ఇప్పటికే ఇక్కడ పిఠాపురం నియోజకవర్గస్థాయిలో ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రస్తుతం చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శృంగారవల్లభస్వామి హుండీ ఆదాయం రూ.28,43,967



ఆలయంలో ఆదాయాన్ని లెక్కించిన దేవదాయశాఖ అధికారులు

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 93 రోజులకు అన్నదాన హుండీ ద్వారా రూ.6,74,695, హుండీల ద్వారా 21,69,272 వెరసి రూ.28,43,967 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు వి.ఫణీంద్రకుమార్, సాయిప్రసాద్, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, దేవస్థానం మాజీ చైర్మన్ బందిలి సుబ్రహ్మణ్యం, అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు,నారాయణాచార్యులు ఉన్నారు.

పిఠాపురంలో శత చండీ మహాయాగం ప్రారంభం

పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌రోడ్డులో గల సద్గురు గోపాల్‌బాబా ఆశ్రమంలో 3 రోజుల పాటు నిర్వహించే శ్రీ మహారుద్ర సహిత శత చండీ మహాయాగం సోమవారం ప్రారంభమైంది. 108 యజ్ఞకుండాలతో 116మంది రుత్విక్కుల మంత్రోశ్చారణల మధ్య యాగాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆది పరాశక్తి అనుగ్రహం ఈనేలపై ఉండాలని, లోకకల్యాణార్థం శ్రీ సన్నిధిసేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ మహాయాగాన్ని నిర్వహిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు వడ్లమాని సుబ్రహ్మణ్యశర్మ అవదాని, శ్రీసన్నిధి సత్యంలు వెల్లడించారు. 50మంది మహాసిద్ధ గురువులు, యోగులు, నాగసాధువుల సమక్షంలో ఈ మహాక్రతువు జరుగుతోందని తెలిపారు.చండీయాగాన్ని తిలకించేందుకు భక్తులు అధికంగా తరలివచ్చారు. యాగంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శత చండీ మహాయాగంలో పాల్గొన్న నాగసాధువులు, మహాసిద్ధగురువులు

జేఎన్‌టీయూకేలో... డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్



డ్రోన్‌లను పరిశీలిస్తున్న రామ్మోహనరావు, అతిథులు

జేఎన్టీయూకే, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో భారత విద్యా మంత్రిత్వ శాఖ సహకారంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ అనే అంశంపై డీఐసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ.గోపాలకృష్ణ అధ్యక్షతన సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్‌చైర్మన్ కె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా, ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్‌లు అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా రామ్మోహనరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో డ్రోన్ టెక్నాలజీని ప్రతీ చోటా ఉపయోగించడం జరుగుతందని, అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ వినియోగంలో ముందంజలో ఉన్నాయన్నారు. చాలా ఇంజనీరింగ్ కళాశాలలు ఇప్పటికే డ్రోన్ టెక్నాలజీ ప్రయోగశాలలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వినూత్న ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే డ్రోన్‌లను రూపొందించేందుకు ముందుకురావాలని విద్యార్థులకు సూచించారు. వీసీ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు డ్రోన్‌ప్లైట్, అసెంబ్లింగ్, ఫ్లయింగ్ టెక్నిక్స్, డ్రోన్ కాన్ఫిగరేషన్ తదితర అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. మాజీ ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, డాక్టర్ మీరాసాహెబ్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్ చైర్మన్ రామ్మోహనరావు

ఎన్ఐఆర్ఎఫ్ అనేది పరీక్ష

ఎన్ఐఆర్ఎఫ్ అనేది నాయకత్వ వృత్తికి ఒక పరీక్ష వంటిదని ఏపీఎస్సీహెచ్‌ఈ వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు అన్నారు. వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐక్యూఏసీ) డైరెక్టరేట్ ఆధ్వర్యంలో డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ సమన్వయకర్తలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ 2025లో మెరుగైన పనితీరు దిశగా వ్యూహాత్మక విధానం అనే అంశంపై సోమవారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఐక్యూఏసీ డైరెక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా, ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. రామ్మోహనరావు మాట్లాడుతూ రానున్న 5ఏళ్లలో ఏపీలో 15 నుంచి 20 వరకూ విదేశీ విశ్వవిద్యాలయాలు, 20 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఏర్పాటుకానున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, వీఎస్ఎస్ కుమార్, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ సిద్ధం

తెలుగు రాష్ట్రాల కోఆర్డినేటర్ శ్రీనివాస్



చెందుర్తిలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆంధ్ర, తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి సొసైటీలో సోమవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల పనితీరు తెలుసుకునేందుకు ఉద్యోగులు, రైతులతో సమావేశమై వారి అభిప్రాయా లు సేకరించి సంఘాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలుతగా చెందుర్తి సొసైటీని సందర్శించానని, కాకినాడ జిల్లాలోని 15 సొసైటీలను సందర్శించి సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా 2వేలమందిని కలిసేలా ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో సహకార అభివృద్ధి కమిటీలు ఎప్పటికప్పుడు సంఘాల పనితీరును సమీక్షించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాయని చెప్పారు. నూతన సొసైటీల ఏర్పాటుతో పాటు నష్టాల్లో ఉన్న సొసైటీలు పునరుద్ధరించడంపై దృష్టిసారిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ పిఠాపురం బ్రాంచి మేనేజరు, చెందుర్తి సొసైటీ కార్యదర్శి అనుకుల రాంబాబు పాల్గొన్నారు.

‘శ్రీప్రకాష్’లో ముగిసిన టీటీ పోటీలు

పెద్దాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో సీతా నరసింహ క్షేత్ర మల్టీ పర్పస్ హాల్లో నిర్వహించిన అంతర్ జిల్లా రాష్ట్రస్థాయి టీటీ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ.రామచంద్రావు హాజరై మాట్లాడారు. క్రీడలు మానవ మేధస్సును ఉత్తేజం చేసి దేహాన్ని పటిష్టపరుస్తాయన్నారు. శాప్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వారికి మరిన్ని సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ కాకినాడలో క్రీడల నిమిత్తం ఇటువంటి అత్యాధునిక హంగులతో ఉన్న మల్టీపర్పస్‌హాల్‌ను నిర్మించడం ఎంతో మంది విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ భవిష్యత్‌తరాలు గర్వించదగ్గ అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ పాఠశాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముఖ్య అతిథులకు పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్, పాఠశాల జాయింట్ కార్యదర్శి సమీర జ్ఞాపికలను అందజేశారు. అలాగే ముఖ్య అతిథులు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఏపీ టీటీ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, వైస్ చైర్మన్ వి.భాస్కరరామ్, హానరరీ చైర్మన్ రావు చిన్నారావు, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



టీటీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు




జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతుల వేషధారణలో పిఠాపురం భాష్యం స్కూలు విద్యార్థులు

పంచెకట్టు...తలపాగా!

రైతు వేషధారణలో అలరించిన చిన్నారులు

పిఠాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నదాతల మాదిరిగానే పంచెకట్టు, తలపాగా, చేతిలో కొడవలి, నెత్తిపై గడ్డిమోపు, గడ్డి కోస్తూ పంట పొలాల్లో ఆ చిన్నారులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం పట్టణంలోని భాష్యం స్కూలు లిటిల్‌చాంప్స్ విద్యార్థులు సోమవారం రైతుల వేషధారణలో అందరినీ అలరించారు. సంప్రదాయ వేషధారణతో పొలాల్లో హల్‌చల్ చేశారు. దేశాభివృద్ధిలో రైతులు కీలకపాత్ర పోషిస్తున్న తీరు, వారు పంటలు ఏ విధంగా పండిస్తారనే అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూలు ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్‌ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం



వాడపల్లిలో దాతకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన నున్న కృష్ణహనుమంతరావు(పవన్)-శిరీష దంపతులు రూ.4 లక్షలు విరాళాన్ని సోమవారం సమర్పించారు. దాతలకు వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందచేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సామర్లకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన వైవీపీఎస్.ప్రసాద్ దంపతులు తమ కుమారుడు యాళ్ల వెంకట సత్యసాయి నవీన్ పేరిట రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈవో బళ్ల నీలకంఠానికి చెక్‌ను సోమవారం అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనాలను చేయించి నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటం ఇచ్చారు.

ఈ-వ్యర్థం.. అనర్థం!!



మారుతున్న కాలానికి అనుగుణంగా రోజురోజుకు ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరుగుతోంది. దీనివల్ల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు బాగా పెరగడంతో పూర్తిస్థాయిలో అవి పునశ్శుద్ధికి నోచుకోవడం లేదు. దీంతో భూమి, గాలి, నీరు కాలుష్యం అవుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలామంది రెండేసి ఫోన్లు, రెండు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, రెండు టీవీలు, ఇయర్ ఫోన్స్, ఛార్జర్లు, ప్రింటర్లు, జెరాక్స్ మిషన్లు ఇలా అనేక రకాలైన ఎలక్ట్రానిక్ వస్తువులను అవసరానికి మించి కొనుగోలు చేసి వాడుతున్నారు. అవి పాడైన తర్వాత పక్కన పాడేస్తున్నారు. తర్వాత వాటి పరిస్థితి ఏంటి..? వాటినే ఈ-వేస్ట్ అంటారు. దీన్ని ఏం చేయాలనే దానిపై కథనం..

- భారీగా మూలకు చేరుతున్న ఎలక్ట్రానిక్ వస్తువులు
- కొత్తవాటి రాకతో పాతవి పక్కకి..
- ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు.. అన్నింటిదీ ఇదే పరిస్థితి..
- కార్యాలయాలు, దుకాణాలు, ఇళ్లల్లో తెలియకుండానే పేరుకుపోతున్న వైనం
- పునర్వినియోగమే మేలంటున్న పర్యావరణవేత్తలు, ప్రేమికులు
- ఈ-వ్యర్థాల సేకరణకు.. కాకినాడలో మూడు కేంద్రాలు



కాకినాడ వార్ఫు రోడ్డులోని ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రం



కలెక్షన్ సెంటర్‌లోని ఈ-వ్యర్థాలు

జేఎన్టీయూకే, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పాత కంప్యూటర్ల స్థానంలో నూతన సాంకేతికత ఆధారంగా నడిచే కంప్యూటర్లను అమరుస్తున్నారు. ఇదొక నిరంత్ర ప్రక్రియ పాతవాటిని పక్కన పడేసి.. కొత్త పెడుతుంటారు. పాత వాటిని ఏంచేయాలో పాలుపోదు. వాటిని స్టోరూంలకు పరిమితం చేయడం తర్వాత.. చెత్తగా పడేయడం జరుగుతోంది. కొంతమంది వృత్తి రీత్యా రెండు సెల్‌ఫోన్లు ఉపయోగిస్తున్నారు. అవి అలా ఉండగానే కొత్తరకం మోడల్ సెల్‌ఫోన్‌ని కొనుగోలు చేస్తున్నారు. పాతవాటిని పక్కనే పెట్టేస్తున్నారు వాటిని విక్రయిస్తే దానిలోని డేటా ఎక్కడ దుర్వినియోగమవుతుందోననే భయంతో వాటిని ఇంట్లో పక్కనే పెట్టేస్తున్నారు.

● ప్రతి ఇంట్లోను..

ప్రతి ఇంట్లోను ఇతర వ్యర్థాల కంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాలే అధికంగా పేరుకుపోతున్నాయి. అవి పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయి. ఆ విధంగా ఉండే వాటిలో ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. ఈ పరికరాల్లో వినియోగించే చిప్‌లు, సెమీకండక్టర్లు పర్యావరణానికి ఎక్కువగా హాని చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. అసోచామ్ అనే సంస్థ దేశంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై చేపట్టిన అధ్యయనంలో ఈవ్యర్థాల ఉత్పత్తిలో మహారాష్ట్ర, తమిళనాడు తర్వాత ఏపీ ఉన్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో వాటిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

● జిల్లాలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 52లక్షల85వేలమంది జనాభా ఉంటే 2024 నాటికి ఈ సంఖ్య 65లక్షలకు పెరిగిందని అంచనా. అదే స్థాయిలో ప్రస్తుతం సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరిగింది. వీటికి సంబంధించిన ఛార్జర్లు, బ్లూటూత్‌లు, ఇయర్‌ఫోన్లు వంటి ఉపకరణాలు వస్తున్నాయి. వాటిలో చిన్నపాటి సమస్య వచ్చినా, మార్కెట్‌లోకి కొత్త మోడల్ వచ్చినా పాత వాటిని పక్కన పెట్టేస్తున్నారు. కొత్త మోడల్ కంప్యూటర్‌లు రాగానే పాతమోడల్‌ను అటకెక్కిస్తున్నారు. ఇలా కార్యాలయాలు, కళాశాలలు, ఇళ్లల్లో పాత కంప్యూటర్లు, సీపీయూలు పేరుకుపోతున్నాయి. మౌస్‌లు, కీబోర్డులు నిరుపయోగంగా మారి పాత ఫర్నీచర్ మధ్యలో కనిపిస్తున్నాయి.

సేకరణకు కాకినాడలో మూడు కేంద్రాలు

కోల్‌కత్తాకు చెందిన హుల్లాడెక్ కంపెనీతో అవగాహన ఒప్పందం చేసుకుని కాకినాడలో 3 ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ వార్ఫు రోడ్డులో మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలోను, జేఎన్టీయూకేలోను, గాంధీనగర్‌లోను నిర్వహిస్తున్నారు. ఏడాదిలో రెండుసార్లు ఆ కంపెనీ ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాల ద్వారా సేకరించిన వాటిని వాహనాల్లో కంపెనీ ప్రతినిధులు తీసుకువెళ్తారు.

● పర్యావరణానికి చాలా హాని

ఇళ్లల్లో పేరుకుపోయే తడి,పొడి చెత్తతో పోలిస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మరింతగా హానిచేస్తాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో బంగారం, వెండి, ప్లాటినం వంటి విలువైన లోహాలతోపాటు పాదరసం, తగరం, సీసం, కాడ్మియం, ఆర్సెనిక్, లిథియం, బేరియం వంటి భారలోహాలు కూడా ఉంటాయి. ఇవి జలాశయాల్లోకి చేరితే తాగునీటి కాలుష్యం అవుతుంది. నేలలోకి చేరితే భూసారం క్షీణిస్తుంది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో వాడే పదార్థాలు చెత్తకుప్పలోకి చేరినప్పుడు అనుకోకుండా మంట తగిలి వ్యర్థాలు దహనమవుతున్నాయి. దీంతో వాయుకాలుష్యం ఏర్పడి అనారోగ్యం బారినపడే అవకాశాలున్నాయి. శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక రుగ్మతలకు లోనయ్యే ప్రమాదాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.



● త్వరలో ల్యాబ్ ఏర్పాటు

-కేవీఎస్‌జీ మురళీకృష్ణ, జేఎన్టీయూకే ఉపకులపతి

ఈ-వేస్ట్‌తో కళాఖండాలను తయారు చేసే ల్యాబ్‌ను జేఎన్టీయూకేలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. వర్సిటీ, యూసీఈకేలోని అన్నివిభాగాల నుంచి వచ్చే ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వ్యర్థాలతో కళాకృతులను తయారుచేస్తారు. కేంద్రం స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం ద్వారా ఈ-వేస్ట్‌మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది.

ఆన్‌లైన్‌లో పారామెడికల్ ఉద్యోగాల ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్‌లు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ)లో పారామెడికల్ ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఈ మెరిట్ లిస్ట్‌లను అభ్యర్థులు చూసుకోనేందుకు వీలుగా ప్రదర్శిస్తామన్నారు. అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 28 లోపు వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. మెరిట్ లిస్ట్‌లో అభ్యంతరాలు ఉంటే రిమార్క్‌ల్లో అభ్యంతరాలు తొలగింపునకు ఆ అభ్యర్థి ఈనెల 24 నుంచి 28 లోపు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకుని గెజిటెండ్ అటెస్టేషన్‌తో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు ఆర్ఎంసీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

27న రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

కాకినాడ అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయి మహిళ, పురుషుల వాలీబాల్ జట్ల ఎంపిక ఈనెల 27న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు క్రీడాప్రాధికార సంస్థ జిల్లా అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. జిల్లానుంచి అర్హులైన సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అర్హతపత్రాలతో హాజరవ్వాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7నుంచి 13 వరకు రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

హోరాహోరీగా సాగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- పెద్దఎత్తున తరలివచ్చిన క్రీడాభిమానులు



రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు

రావులపాలెం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని సీఆర్సీ క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 50వ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నారు. పలు జట్లు గెలుపు కోసం ఆద్యంతం పోరాడాయి. పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున క్రీడా అభిమానులు తరలివచ్చారు. ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమించిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్‌రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రావులపాలెం సీఆర్సీ క్రీడాప్రాంగణంలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలురు

అన్నవరంలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పూజలు

అన్నవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు సోమవారం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ విభాగ ఏఈవో కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పదిలం బెనబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం తాతయ్యబాబు

దంత వైద్యులకు భారత్ పుట్టినిల్లు

- రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి
- ఘనంగా జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే
- ముఖ్యఅతిథులుగా హాజరైన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి
- దంత వైద్యులకు పట్టాభిషేకం



మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి



పట్టాలు ప్రదానం చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల, రుడా ఛైర్మన్ బీవీఆర్, డాక్టర్ గన్ని భాస్కరరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దంత వైద్యులు కలిగిన దేశం భారతదేశమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ దంతవైద్య కళాశాల 7వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను స్థానిక శుశృత హాల్‌లో సోమవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారత్‌లో మానవవనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వైద్యవిద్యార్థులకు సూచించారు. డబ్ల్యూహెచ్‌వో గణాంకాల ప్రకారం ప్రతి 7వేల మందికి ఒక దంత వైద్యులు ఉండగా, ఇండియాలో ప్రతి 5వేలమందికి ఒక దంత వైద్యులు ఉన్నారన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ వైద్యరంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం కల్పించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని వైద్యకళాశాలలు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. యువ వైద్యులు సేవా దృక్పథంతో సేవలందించాలన్నారు. మరో ముఖ్యఅతిథి రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ వైద్యరంగంలో ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిళ్లను అధిగమిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దంత విద్యను పూర్తి చేసిన యువ వైద్యులకు పట్టాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్యవిద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, డాక్టర్ తరుణ్, మెడికల్ సూపరింటెండెంట్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ గంటా సునీల్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి విలేకరి హత్య కేసులో ఆధారాలు ఉంటే ఇవ్వండి

- తుని పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న తుని పట్టణ, రూరల్ సీఐలు

తుని రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తుని రూరల్ ఎస్.అన్నవరం గ్రామంలో అతి కిరాతకంగా హత్యకు గురైన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కాతా సత్యనారాయణ కేసుకు సంబంధించి ఆధారాలు ఉంటే ధైర్యంగా పోలీసులకు సమర్పించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తునిరూరల్ సీఐ చెన్నకేశవరావు స్పష్టం చేశారు. ఈమేరకు తుని రూరల్ సర్కిల్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో జరిగిన ఆంధ్రజ్యోతి విలేఖరి హత్యకు సంబంధించి సీఐడీ విచారణ లోతుగా జరుగుతోందని, హత్యకుగల కారకులకు తొందరలోనే శిక్షిస్తామని ఆయన తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు తుని నియోజకవర్గంలో క్రైం రేట్ సగానికి తగ్గిందని, తునిలో ప్రశాంత వాతావరణం నెలకొనడం శుభపరిణామం అన్నారు. గతం మాదిరిలా తునిలో తప్పుడు కేసులు ఉండవన్నారు. పండుగులు పురస్కరించుకుని గుండాట, కోడి పందేలు నిర్వహించడం నేరమని, పబ్లిక్ ప్లేసుల్లో ర్యాలీలు, ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించుకోదలిస్తే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు ఇళ్లవద్ద సీసీ కెమెరాలు అమర్చుకునేందుకు అందరూ చొరవ చూపాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణ గానీ, నిరాధారమైన ఆరోపణలు గానీ చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్‌నేరస్తులపట్ల పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. పట్టణ సీఐ గీతారామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడాదైనా సమస్య పరిష్కరించలేదు

- అధికారుల తీరుకు నిరసనగా.. కలెక్టరేట్‌లో కేక్ చేసేందుకు ప్రయత్నం
- అడ్డుకుని స్వాధీనం చేసుకున్న పోలీసులు



అధికారులతో కట్ చేయించేందుకు సిద్ధం చేసిన కేక్



కేక్ తీసుకువచ్చిన కోట చంద్రశేఖర్, షేక్ రెహ్మతుల్లా షరీఫ్

అమలాపురం టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించి ముంపు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏడాది క్రితం అర్జీ అందించారు. మళ్లీ పలుసార్లు అర్జీలు ఇచ్చినా పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు ఆ అర్జీలను పరిష్కరించినట్టు చూపుతూ క్లోజ్ చేస్తున్నారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి సైతం ఇదేవిధంగా చేయడంతో ఆవేదన చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు గ్రామానికి చెందిన తెలుగు యువత మండల శాఖ అధ్యక్షుడు కోట చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినూత్నంగా ఏడాది కాలమైనా అర్జీని పరిష్కరించలేదని చెబుతూ 'పిటిషన్ ఫస్ట్ యానివర్శరీ' పేరిట కేక్‌ను సిద్ధం చేసి పంచాయతీ అధికారులతో కట్ చేయించేందుకు తీసుకువచ్చారు. అప్పటికే సమాచారం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రీవెన్స్‌లో కేక్ తీసుకువచ్చిన వారిని గుర్తించారు. కేకుతోపాటు రావులపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని బయటికి తీసుకువచ్చారు. చంద్రశేఖర్ మరోసారి అర్జీని అందించి బయటకి వచ్చి తమ గోడును వివరించారు. గతేడాది ఇదే డిసెంబరు నెలలో రావులపాడులోని దుర్గావతి ఆస్పత్రి వీధిలో ఉన్న ఆక్రమణలు తొలగించి ముంపునీటి సమస్యను పరిష్కరించాలని అర్జీ అందించామన్నారు. అప్పట్లో పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిపట్టాభిరామయ్య విచారణ జరిపి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలు తొలగించని పక్షంలో పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అప్పట్లో ఇచ్చిన అర్జీ మేరకు తనను కలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నెల రోజుల వ్యవధి ఇవ్వాలని కోరారు. ఆ మేరకు లిఖిత పూర్వక లేఖను సైతం అందజేశారు. ఏడాది పూర్తి అవుతున్నా ఇంతవరకు ఆక్రమణలు తొలగించలేదన్నారు. ఈనెల 2న చంద్రశేఖర్ మరోసారి కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. సమస్యను పరిష్కరించను లేదు. అర్జీదారుని సంప్రదించకుండానే సమస్య పరిష్కరించినట్టు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి మెస్సేజ్ వచ్చిన తీరును ఆయన తప్పుబట్టారు. సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని చంద్రశేఖర్, టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ రెహ్మతుల్లాషరీఫ్ పేర్కొన్నారు.

6నుంచి యానాం ప్రజా ఉత్సవాలు

- పుదుచ్చేరి సీఎం, గవర్నర్‌ల పర్యాటనలు ఖరారు
- 6న సీఎం, 8న గవర్నర్ రాక



గవర్నర్‌తో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రతిఏటా జనవరి 6నుంచి 8వరకు ప్రతిష్టాత్మకంగా జరిగే యానాం ప్రజాఉత్సవాలకు పుదుచ్చేరి గరవ్నర్, సీఎం పర్యటనలు ఖరారైనట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు పుదుచ్చేరి వెళ్లిన ఆయన గవర్నర్ కైలాష్‌నాథ్, సీఎం ఎన్.రంగసామితో భేటీ అయ్యారు. యానాంకు సంబంధించిన అనేక పెండింగ్ అంశాలపై చర్చించడంతోపాటు వినతిపత్రం ఇచ్చానన్నారు. 6న యానాం ప్రజా ఉత్సవాల ప్రారంభ వేడుకలకు ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామితోపాటు మత్స్యశాఖ, వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ మంత్రులు హాజరు కానున్నారు. 8న జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ కైలాష్‌నాథ్, పర్యాటకశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, గవర్నర్ కార్యదర్శి హాజరుకానున్నారన్నారు. వీటికి సంబంధించిన అంశాలపై చర్చించామన్నారు. యానాంకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తదితర పెండింగ్ అంశాలపై వివరించారు.

గంజాయితో ఒకరి అరెస్టు

ఆలమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఏటిగట్టుపై నుంచి గంజాయి అమ్మకానికి తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి ఒకరిని అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలమూరువద్ద ఏటిగట్టుపై స్థానికుడు బాడితిపోయిన గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడినుంచి 470గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంజాయి సరఫరా చేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి వివరాలు రాగానే కేసు నమోదు చేయనున్నామని తెలిపారు. గంజాయితో అరెస్టు చేసిన సమయంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబు, ఎస్ఐ ఎం.అశోక్, వీఆర్వో భారతి, వీఆర్‌ఏ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ప్రభాకర్, రవికుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

లే నాన్నా..ఇంటికెళ్దాం..!

- టిప్పర్ లారీ ఢీకొని తల్లి కళ్లెదుటే కుమారుడి మృతి
- కన్నీటి పర్యంతమైన తల్లి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తల్లీకొడుకులు వెళ్తున్న ద్విచక్రవాహనానికి ఒక లారీ అడ్డుగా వచ్చింది. అమ్మా.. అంటూ రోడ్డుపై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.. ఆ యువకుడిని తల్లి బిగ్గరగా లే.. నాన్నా ఇంటికెళ్దాం.. అన్నా కదలికలేదు. దీంతో తల్లి బోరున విలపించిన హృదయవిదారక ఘటన ఇది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎల్.నరేష్(20) తన తల్లి సత్యవతితో కలిసి బ్యాంక్ పని నిమిత్తం బుల్లెట్‌పై మోరంపూడి సెంటర్‌కు బయలుదేరారు. పిడింగొయ్యి జాతీయ రహదారి సెంటర్ వద్ద మలుపులోకి వచ్చేసరికి లాలాచెరువు వైపు నుంచి వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో బుల్లెట్ అదుపు తప్పి సత్యవతి కిందపడిపోగా నరేష్ ఆ బండి ట్యాంక్, హ్యాండిల్‌కు చాతితో గుద్దుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తల్లి స్థానికుల సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమించి నరేష్ మృతి చెందాడు. సత్యవతికి భర్త గతంలోనే మరణించారు. వీరికి ఇద్దరు కుమారులుండగా నరేష్ చిన్నవాడు. మృతదేహాన్ని పట్టుకుని తల్లి రోదించిన తీరుచూపరులను కంటతడి పెట్టించింది. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లలిత కళల్లో ఆర్ట్స్ కళాశాలకు ప్రథమ బహుమతి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన జిల్లా యువజనోత్సవంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు లలిత కళల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారు. జానపదనృత్యాలు, ఉపన్యాసం వంటి విభాగాల్లో ఉత్తమ ప్రతిభకనబరిచారని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. జానపద నృత్య విభాగంలో విద్యార్థులు రూ.7,000 నగదు బహుమతిని కూడా అందుకున్నారని తెలిపారు. యువజనోత్సవాల్లో రాణించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ జరగబోయే ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఆర్ట్స్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సోమవారం వ్యూహాత్మక మానవ వనరుల నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలు అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.ప్రసాద్, పీడీలు పీవీవీ లక్ష్మి, విజయ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సత్యమే గెలిచింది

ఎమ్మెల్యే నల్లమిల్లి



లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న నల్లమిల్లి దంపతులు

అనపర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎప్పటికీ సత్యమే జయిస్తుందని బిక్కవోలు లక్ష్మీగణపతి మరోసారి రుజువు చేశారని, ఆయన ఆశీస్సులతో శాసన సభలో అడుగు పెట్టానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. 2020 డిసెంబరు 23న అప్పటి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ప్రతిపక్ష నేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మధ్య సత్యప్రమాణం జరిగింది. ఇది జరిగి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, పల్లె శ్రీనివాసరెడ్డి, వెలుగుబంటి సత్తిబాబు, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం, బేరా వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల విద్యాసంస్థలో ఇన్‌స్పైర్-2024



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశం గర్వించ దగ్గ ఐజీటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్, ఎన్ఐటీ తదితర విద్యా సంస్థల్లో తిరుమల విద్యాసంస్థలకు చెందిన 627 మంది విద్యార్థులు ప్రవేశాలు సాధించడం చిన్న విషయం కాదని కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని కాతేరు శివారు తిరుమల విద్యాసంస్థల్లో సోమవారం సాయంత్రం ఇన్‌స్పైర్-2024 పేరుతో ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్, ఎన్ఐటీలలో ప్రవేశాలు సాధించిన విద్యార్థులను అభినందించేందుకు తిరుమల సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఐటీ, డాక్టర్స్, ఇంజనీర్లుగా మన దేశ పౌరులు విదేశాల్లో విజయవంతంగా పనిచేయగలుగుతున్నారంటే బేసిక్ స్థాయిలో వారికి అందిన నాణ్యమైన విద్యే కారణమన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తిరుమల బృందం ఎనలేని కృషి చేసిందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు దేశం గర్వించదగ్గ విద్యాసంస్థల్లో సీట్లు సాధించినవారంతా తిరుమల విద్యార్థులేనన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ తిరుమల విద్యాసంస్థల రిపిటేషన్, తల్లిండ్రుల గౌరవ మర్యాదలు విద్యార్థుల చేతుల్లోనే ఉన్నాయన్నారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ముఖ్యఅతిథులు సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సరోజినిదేవి, సతీష్ బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చక్రద్వారబంధంలో ఆ భూమి మాదే'

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చక్రద్వార బంధం పంచాయితీ పరిధిలోని వెలుగుబంధ గ్రామంలో సర్వేనెంబర్లు 688/1బి, 689/1, 690, 691/6లో ఉన్న 5.59 ఎకరాల భూమి తమదేనని కొమ్మిరెడ్డి వెంకట సత్యనారాయణ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ భూమిని తాత చలపతి తమ పేరున వీలునామా రాసారని చెప్పారు. ఈ భూమి నాదే అనడానికి అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు.

క్రీడాకారులకు ప్రత్యేక వసతులు కల్పిస్తాం

» ఎమ్మెల్యే వాసు, శాప్ చైర్మన్ రవినాయుడు
» రాజమహేంద్రవరంలో ఆర్చరీ చాంపియన్ షిప్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఆదిరెడ్డి వాసు, రవినాయుడు

రాజమహేంద్రవరం సిటీ/కల్చరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాకారులందరికీ అత్యుత్తమ క్రీడా వసతులు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని ఆ దిశగా రాష్ట్ర క్రీడాప్రాదికార సంస్థ కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 41వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలను శాప్‌చైర్మన్ రవినాయుడుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాజమహేంద్రవరంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలు, స్పోర్ట్స్ ఎరీనాల ఏర్పాటుకు శాప్ తీసుకుంటున్న చర్యలు సంతోషదాయకమన్నారు. జాతీయస్థాయి పోటీలు, ఖేలో ఇండియా పోటీలను రాజమహేంద్రవరంలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకూ పోటీలు జరుగుతాయని సెక్రటరీ లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో శేషగిరి ,ఆర్చరీ జనరల్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

మల్లిబాబుకు కుట్టుమిషన్ల వితరణ

ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి ఉపాధి కోల్పోయిన టైలర్ మల్లిబాబును ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదుకున్నారు. తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద భవానీ చారిటబుల్ ట్రస్ట్ తరుపున సోమవారం మూడు కుట్టుమిషన్లు అందించారు.

పీజీఆర్ఎస్‌కు 17 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న అర్జీలు స్వీకరించారు. కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో డ్రైనేజీ సమస్యలు, ఆధార్ కార్డు సమస్యలను ప్రజలు విన్నవించారు.

కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో పాలియాటివ్ కేర్ ప్రోగ్రామ్‌లో పనిచేయడానికి ఒక జనరల్ ఫిజీషియన్/వైద్యాధికారి, ముగ్గురు స్టాఫ్ నర్సుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఈ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు జనవరి 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు బొమ్మూరులోని జిల్లా వైద్యశాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నియామకాలు పూర్తి మెరిట్ ప్రాతిపదికన పారదర్శకంగా జరుగుతాయని, మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

దీపక్‌రాజ్‌కు గరికపాటి కళా కౌముది అవార్డు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ రచయిత దీపక్ రాజ్‌కు గరికపాటి కళా కౌముది అవార్డు లభించింది. ఈ మేరకు ప్రజ్ఞసాహితి పుల్లెపు తాతయ్య మెమోరియల్ సంస్థ (పీటీఎం) వ్యవస్థాపకుడు డాక్టర్ పుల్లేల వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజరుగా పనిచేసిన దీపక్‌రాజ్ రాసిన మన కోనసీమ కథలకుగాను అవార్డుకు ఎంపిక చేశామని పేర్కొన్నారు.ఈ అవార్డును కోనసీమలోనే 2025 జనవరి 5న ముమ్మిడివరం నియోజకవర్గం ఐ.పోలవరంలో పీటీఎం సంస్థ 17వ వార్షికోత్సవంలో భాగంగా ప్రధానం చేస్తామన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరానికి చెందిన తాతారావు (43) ఆటోనగర్‌లో పనిచేస్తుంటాడు. అతనికి భార్య ఉంది. గతంలోనే గొడవలు పడి పుట్టింటికి వెళ్లిపోయింది. తాతారావు ప్రతిరోజు మాదిరిగానే ఆటోనగర్‌లో పనికి వెళ్లి ఆది వారం అర్ధరాత్రి దాటే వరకు మద్యం తాగాడు, ఆ మత్తులో రోడ్డుపై నడుచుకుంటూ లాలాచెరువు జాతీయ రహదారి వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు మృతిచెందాడు. తాతారావు తల్లి రాఘవమ్మ ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అఖిలపక్ష సమావేశానికి అనుమతి ఇవ్వండి

జిల్లా కలెక్టర్‌కు 'అస్సాగో' బాధితుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

గోకవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 28న తలపెట్టనున్న అఖిలపక్ష సమావేశానికి అనుమతివ్వాలని కోరుతూ మండలంలోని గుమ్మళ్లదొడ్డి అస్సాగో బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అస్సాగో కంపెనీపై నివేదిక సమర్పించాలని తమ సమక్షంలో ఆదేశించినట్టు బాధితులు స్థానిక విలేఖరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశానికి అనుమతి కోరుతూ వెళ్లిన తమకు తగిన భరోసా కల్పించారని, త్వరలో గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినటుట తెలిపారు. తమ గ్రామంలో విధించిన పోలీస్ ఆంక్షలను సడలించి, మానవ హక్కులను కాపాడాలని గుమ్మళ్లదొడ్డి గ్రామస్థులు కోరుతున్నారు.

నివేదిక కోసం ఎదురుచూపు

గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన అస్సాగో పరిశ్రమ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గతంలో స్థానికులు భారీ ఎత్తున పలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారుల సమన్వయంతో, గ్రామస్థుల భాగస్వామ్యంతో కమిటీని ఏర్పాటుచేసి 45 రోజుల్లో నివేదిక సమర్పిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఇచ్చిన గడువు ముగియడంతో నివేదికను బహిర్గతం చేయాలని బాధితులు కోరుతున్నారు.

రైతు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధం తగదు

నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ చట్టం ముసాయిదా కాపీల దహనం



ముసాయిదా కాపీలను దహనం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధానికి పాల్పడడం తగదని పలువురు రైతు, కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ చట్టం ముసాయిదాను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం రాజమహేంద్రవరంలో నిరసన ప్రదర్శన చేశారు. నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ చట్టం ముసాయిదా కాపీలను దహనం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.జోజి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు బుద్ధుడు, పడాల రామకృష్ణ, సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ మూర్తి, బి.పవన్, పూర్ణిమరాజు, ప్యారీలింగం తదితరులు పాల్గొన్నారు.

జంబూపట్నం, గోనగూడెంలో రెవెన్యూ సదస్సులు

● భూ సమస్యలపై ఫిర్యాదులు అందించిన రైతులు



పశ్చిమగోనగూడెంలో రెవెన్యూ సదస్సు దృశ్యం

కోరుకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబూపట్నం, పశ్చిమగోనగూడెం గ్రామ సచివాలయాల వద్ద సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వే లోప భూయిష్టంగా ఉందని, దీంతో పొలాల్లో హెచ్చుతగ్గులు వచ్చాయని, రైతులు భాగస్వామ్యం లేకుండానే సర్వే జరిగిందని రైతులు పేర్కొన్నారు. రీసర్వేను తక్షణం రద్దు చేయకపోతే రైతులు చాలా ఇబ్బందులు పడతారని అనేక మంది రైతులు రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు వివరించారు. ఈసందర్భంగా జంబూపట్నం, రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జంబూపట్నం రెవెన్యూ సదస్సులో 10 ఫిర్యాదులందాయి. వీటిలో 8 రీసర్వేకు సంబంధించి, ఒకటి ఈనం, మరొకటి ఆర్‌వోఆర్ ఫిర్యాదులు ఉన్నాయి. పశ్చిమగోనగూడెం రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు రీసర్వేలో తప్పులు దొర్లాయని, వాటిని సరి చేయాలని దరఖాస్తులు అందజేశారు. సమావేశంలో తహశీల్దార్ సుస్వాగతం, వీఆర్వో కె.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడీఏ మల్లికార్జునరావు, ఆర్ఐ రామిరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులు జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం

రాజమహేంద్రవరం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ పనులు నత్తనడకన సాగవం పట్ల జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి తదితర అధికారులతో కలసి సమీక్షించారు. పల్లెపండుగ కింద జిల్లాలో ఉపాధి హామీ నిదులతో 654 పనులు చేపట్టగా ఇప్పటి వరకూ 252 పూర్తయినట్టు చెప్పారు. రాజానగరం నియోజకవర్గంలో పనులు బాగా వెనకబడ్డాయని, సీతానగరంలో ఒక పని కూడా పూర్తి కాలేదని,రాజానగరంలో 2, కోరుకొండలో 3 మాత్రమే పూర్తి చేయడం పట్ల ఆమె ఎంపీడీవోలపై మండిపడ్డారు. ఇలా కొన్ని మండలాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నాయో ఆరా తీశారు. చెత్త సేకరణ వివరాలు పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో 299 పంచాయతీల్లో 248 గ్రామాల డేటా ఎంట్రీ నమోదు చేశారన్నారు. ప్రతి రోజూ ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి డేటా విశ్లేషిస్తున్నారన్నారు. ఉచిత గ్యాస్ సిలెండర్ పథకం అమలులో ఎన్‌పీసీఐ పోర్టల్‌కు లబ్ధి దారుల వివరాల అనుసంధానం చేయాలని చెప్పారు.

'రాహుల్‌గాంధీపై చర్యలు తీసుకోవాలి'

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుతో అడ్డగోలుగా రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్‌బాబు డిమాండ్ చేశారు. గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం నిరసన ప్రదర్శన చేశారు. ఎస్సీ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ పల్లి ధర్మేష్ ప్రసాద్ కుమార్, సీనియర్ నాయకులు మద్దాల కొండలరావు, ఉపాధ్యక్షుడు మల్లిపూడి రవికుమార్, రంగంపేట మండల నాయకులు బచ్చల విజయకుమార్, రూరల్ అధ్యక్షుడు కందెల్లి రామారావు, వెన్నబట్టుల అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవంగా ఎన్నికైన జాంపేట దేవాంగ సంక్షేమ సంఘ కార్యవర్గం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్23 (ఆంధ్రజ్యోతి): జాంపేట ఉమారామలింగేశ్వర కల్యాణ మండపంలో సోమవారం ది జాంపేట దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా గంపా లీలా గిరిజీ శంకర్, సహాధ్యక్షుడిగా కాసిన వెంకట అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా నల్లా శివ శంకరరావు, సహాయ కార్యదర్శిగా మొతికి వినయ్ మనోజ్, కోశాధికారిగా పింజర్ల భాస్కరరావు, సహాయ కోశాధికారిగా ఆకాశపు సాంబ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కాలెపు సత్యనారాయణమూర్తికి సన్మాన పత్రం అందజేసి,జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్ రొబ్బి విజయశేఖర్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జేగురుపాడులో జాతీయ రైతు దినోత్సవం



జేగురుపాడు రైతు దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

కడియం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జేగురుపాడులో నీటి సంఘం డైరెక్టర్ వ్యవసాయ క్షేత్రం వద్ద జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ రైతులతో సమావేశం అయ్యారు. రైతు ప్రాముఖ్యం గురించి వివరించారు. రైతులకు సేంద్రియ ఎరువులు అందచేశారు. రైతుల సమక్షంలో రవిరామ్‌కిరణ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, గారపాటి అమరనాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, నాగిడ్డి రామకృష్ణ, పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవాభావం కలిగి ఉండడం అభినందనీయం



రక్తదానం చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు నాని, టీడీపీ యువత

కడియం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): యువత సేవాభావాన్ని కలిగి ఉండటం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. సోమవారం టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ పుట్టినరోజు వేడుక ఘనంగా జరిగింది. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణలు రవిరామ్‌కిరణ్‌కు మొక్కను అందచేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రవిరామ్‌కిరణ్ పుట్టినరోజు పురస్కరించుకుని జీఎస్ఆర్ ఫౌండేషన్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్(నాని), చిలుకూరి ప్రభ ఫ్రెండ్స్ సర్కిల్ పాల్గొని రక్తదానం చేశారు. ఈసందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందచేశారు.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రాజానగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల27వ తేదీన ఎంపీపీ మందారపు సీతారత్నం అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10.30గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో జరిగే సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

'ఇసుక బుకింగ్ పెద్ద స్కామ్'

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ విషయంలో కూటమి ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని వైసీపీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, నక్కా శ్రీనగేష్ ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక బుకింగ్ యాప్ అంతా పెద్ద స్కామ్ అన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్ చేసినా ఫార్మాలిటి ఇస్తేనే కానీ ఇసుక రావడం లేదన్నారు. భారీగా ఇసుకను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో వైసీపీ నాయకులు బిల్డర్ చిన్నా, గేడి అన్నపూర్ణరాజు, సోడదాసి సుదంర్‌సింగ్, కాటం రజనీకాంత్, దాది గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరికరేవులలో రెవెన్యూ సదస్సు

బిక్కవోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆరికరేవులలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 8 దరఖాస్తులు అందాయని తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. సదస్సులో సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, కూటమి నేతలు కొర్ల వినాయకరావు, రెడ్డి శ్రీను, ఇందల వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

బిక్కవోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బిక్కవోలుకు చెందిన కందుల శిరీష ఈనెల21నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి భవాని సోమవారం ఫిర్యాదు చేసిందని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. శిరీష భర్తతో గొడవపడి తల్లి వద్దనే ఉంటుందని, ఈనెల 21న స్థానిక ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న ఇద్దరు అబ్బాయిలకు మధ్యాహ్నం భోజనం తినిపించి అప్పటి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు పేర్కొంది. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బుద్ధవిహార్‌ను సందర్శించిన సీనియర్ సంపాదకులు శ్రీనివాస్



వేమగిరి బుద్ధవిహార్‌ను సందర్శించిన సీనియర్ సంపాదకులు శ్రీనివాస్

కడియం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేమగిరి బుద్ధవిహార్‌ను సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, ఆయన కుటుంబసభ్యులు సందర్శించారు. బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు మహోదయ యాజరా సంపాదకులు శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు. తాను పోలీసు ఉద్యోగం వదిలి, బౌద్ధం వైపు అడుగు పెట్టానని, తాను కష్టాన్ని నమ్ముకున్న వ్యక్తినని, నేటికీ కష్టపడుతున్నానని మహోదయ యాజరా తెలిపారు. వేమగిరి కొండపై ఏర్పాటుచేసిన భారీ బౌద్ధ విగ్రహం, అక్కడ ఉన్న ధ్యానమందిరం తదితర వాటిని శ్రీనివాస్‌కు చూపించారు. అలాగే బుద్ధవిహార్‌లో మహనీయుల విగ్రహాలు ఏర్పాటుచేశామని, జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని యాజరా వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది తోరాటి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యులు సేవా దృక్పథంతో మెలగాలి



కేఎల్ఎల్ లెనోరా దంత వైద్య కళాశాలలో పట్టాలు అందుకున్న యువ దంత వైద్యులు

రాజానగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): యువ దంత వైద్యులు రోగుల పట్ల సేవా దృక్పథంతో మెలగాలని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ కె.సతీష్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజానగ రంలోని కేఎల్ఆర్ లెనోరా దంత వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ వేడుకలకు సోమ వారం ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వైద్య విద్యను పూరి చేసిన విద్యార్థులకు పట్టాలు అందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి అడిషనల్ సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభ, కేఎల్ఆర్ గ్రూప్‌ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్‌పర్సన్ కె.నాగ మణి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.


మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

మాజీ ప్రధాని పీవీ వర్ధంతి



పీవీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అంధ్రకేసరి యువజన సమితితో స్వర్గీయ పీవీ నరసింహారావుకు ఎనలేని అనుబంధం ఉందని సమితి పూర్వాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. పీవీ 20వ వర్ధంతిని పురస్కరించుకుని పీవీ నరసింహారావు పార్కులో పీవీ విగ్రహానికి, ఆంధ్రకేసరి సెంటనరీ జూనియర్ కాలేజీలో పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి పూర్వాధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, దేశిరెడ్డి బలరామనాయుడు, గుడిపూడి సునీల్ గౌతమ్, ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు వి.భాస్కరరామ్, గౌరవ కార్యదర్శి జమ్మి రామారావు, కళాశాల చైర్మన్ జెట్టి ప్రసాదరావు, డి.సత్యనారాయణ, జమ్మి పూర్ణానంద తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి ప్రసన్న వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

బిక్కవోలు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : రెండో తూర్పు తిరుమలగా పేరొందిన బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి రెండో ఏట బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి తెలిపారు. 2012లో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి 2014లో తిరుపతి నుంచి స్వామి వారి విగ్రహం రప్పించి ప్రతిష్ఠించామన్నారు. ఈ ఆలయంలో తిరుమలలో వలే స్వామి చెంతనే కోనేరు, వరాహస్వామి ఆలయ నిర్మాణాలకు రూ. 15 కోట్లు వ్యయం అయ్యిందని తెలిపారు. ప్రతి శనివారం స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తున్నామన్నారు. ఈ నెల 24 నుంచి జనవరి 2 వరకూ స్వామి వారి ద్వితీయ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన మల్లిడి పెదిరెడ్డి 5 కిలోల వెండితో తయారు చేసిన శేష పానుపును బహూకరించారన్నారు.ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు రూ.20 కోట్లు వ్యయం అంచనా వేస్తున్నామని ఆలయ చైర్మన్ గంగారెడ్డి వివరించారు.





విద్యుత్ కాంతుల్లో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం





దివ్యాంగుల వద్దకే వచ్చి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి

72 గంటలు

కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మన వద్దకు వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని 48 గంటల నుంచి 72 గంటల వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఇతర శాఖలకు సంబంధించిన వాటిని 24 గంటల్లో ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న కలెక్టర్ తొలుత కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై తీసుకోవాల్సిన చర్యలు, అర్జీదారుడికి స్లిప్ జారీ చేయడం, పీజీఆర్ఎస్‌లో అప్‌లోడ్ చేయడం మొదలుకొని ఏ అధికారి వద్దకు వెళ్లాలో సూచనలు చేయాలని సిబ్బందికి సూచించారు.అనంతరం కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దివ్యాంగుల చెంతకు వెళ్లి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు.ప్రతి వారం రాష్ట్రస్థాయిలో జిల్లాకు సంబంధించి పీజీఆర్ఎస్‌పై సమీక్ష జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు వివిధ శాఖలకు సంబంధించి 172 అర్జీలు చూడాల్సిందన్నారు. కలెక్టర్ ,జేసీ ,డీఆర్వో 137 అర్జీలు స్వీకరించారు.

పోలీసులకు 26 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ 26 అర్జీలు స్వీకరించారు.ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

నౌ..కాకినాడ.. ఈ టైమ్ కాకినాడది.. అవును మరి నిజమే.. ఎందుకంటే షిప్ తయారీ కేంద్రంగా మారనుంది.. ఆ కేంద్రం అంటే మాటలా.. మన రాష్ట్రంలో ఒక్క విశాఖలో మాత్రమే ఉంది.. ఇప్పుడు కాకినాడలోనూ అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. ఈ నేపథ్యంలో ఆ కేంద్రానికి కాకినాడ అనుకూలంగా ఉంటుందని ప్రతిపాదనలు పంపారు. దీంతో కాకినాడ టైం నేడో రేపో మారనుంది.. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు..



కాకినాడలో తయారైన భారీ షిప్.. నిర్మాణంలో ఉన్న మరో ఓడ

నౌ..కాకినాడ!

మారిటైం బోర్డు పాలసీతో తిరగనున్న దశ

- షిప్‌ల నిర్మాణానికి అనువుగా కాకినాడ
- షిప్ బిల్డింగ్ సెంటర్‌కు ప్రతిపాదన
- సుదీర్ఘ సీఫ్రంట్‌తో ప్రయోజనం
- పలు కంపెనీలూ ఆసక్తి
- గతంలో కరువైన వైసీపీ ప్రోత్సాహం
- మూడు కంపెనీలు వెనక్కు
- ఈసురోమన్న నౌకా నిర్మాణ రంగం
- కూటమితో చిగురిస్తోన్న ఆశలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

షిప్‌ల తయారీ రంగానికి కేంద్రంగా కాకినాడను తీర్చిదిద్దేలా అడుగులు పడుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మారిటైం బోర్డు పాలసీలో నౌకా నిర్మాణ క్లస్టర్ల ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో కాకినాడలో వీటి తయారీ భవిష్యత్తులో భారీగా పుంజుకోబోతోంది. అటు రూ.300 కోట్లతో చిన్న, మధ్యతరహా నౌకల నిర్మాణానికి వీలుగా షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మున్ముందు కాకినాడలో చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌ల తయారీకి ఊతం లభించనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మారిటైం పాలసీ కింద నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం ఇవ్వాలని నిర్ణయించడం, అటు మారిటైం బోర్డు కార్యాలయం సైతం ఇక్కడే ఉండడంతో కాకినాడ దశ తిరగనుంది.

కాకినాడకు ఎప్పటి నుంచో పేరు..

విశాఖలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన హిందుస్థాన్ షిప్‌యార్డు మినహా రాష్ట్రంలో నౌకల నిర్మాణం ఇంకెక్కడా లేదు. కానీ వీటి తయారీకి అత్యంత అనువైన వాతావరణం కాకినాడలోనే ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ యుగంలో కోరంగి వద్ద నౌకల తయారీ, మరమ్మతులు జరిగేవి. అప్పుడే ఈ రంగంలో కాకినాడ పేరొందింది. వాస్తవానికి సుదీర్ఘ సాగర తీరం..దాన్ని ఆనుకుని యాంకరేజ్ పోర్టు వెంబడి వందల ఎకరాల భూములు ఉన్నాయి. నౌకల తయారీకి సముద్రానికి ఆనుకుని విశాలమైన భూములు అవసరం. నౌకలు, బార్జీలు, టగ్‌లు తయారుచేసి ఆ పక్కనే ఉన్న సముద్రజలాల్లోకి వీటిని దించి పరీక్షలు చేస్తారు. ఈ అనుకూల వాతావరణం కాకినాడలోనే ఉంది. సీఫ్రంట్‌గా పిలిచే ఈ సౌకర్యం కాకినాడ జగన్నాథపురం బ్రిడ్జి నుంచి యాంకరేజ్ పోర్టు రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. వీటిని పోర్టు అధికారులు లీజుకు ఇస్తారు. ఇందులోనే శాన్ మెరైన్ ఏటా 20 వరకు చిన్నతరహా ఓడలను తయారుచేస్తోంది. అయితే కొత్త పాలసీ కింద కంపెనీలు వస్తే భవిష్యత్తులో నగరం నౌకల తయారీకి ప్రసిద్ధి చెందనుంది. అటు అధికారులు కొత్త నౌకా నిర్మాణ కేంద్రం ఈ ప్రాంతంలోనే అనువుగా ఉంటుందని తాజాగా గుర్తించారు.

నాడు పట్టించుకోని వైసీపీ

కాకినాడలో శాన్‌మెరైన్ అనే సంస్థ ఒక్కటే ఎన్నో ఏళ్లుగా చిన్న, మధ్యతరహా నౌకలు, బార్జీలు, టగ్‌లు నిర్మిస్తోంది. గతేడాది ఏకంగా 8 వేల టన్నుల భారీ నౌకను నిర్మించింది. వచ్చే ఐదేళ్లలో మరో 25 వరకు నౌకలను నిర్మించి దేశవ్యాప్తంగా పలు కంపెనీలకు అందివ్వడానికి సిద్ధమవుతోంది. మేట్ మెరైన్ అనే కంపెనీ పది ఎకరాల్లో వీటి తయారీకి సిద్ధమైనా గత ప్రభుత్వ ప్రోత్సాహం కరువై పక్కకుపోయింది. కేంద్రం ఒక పక్క రాయితీలు ప్రకటిస్తున్నా గత వైసీపీ సర్కారు మాత్రం ఈ రంగాన్ని ప్రోత్సహించడంపై దృష్టి సారించలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మారిటైం పాలసీని ప్రకటించడంతో ఈ రంగం పుంజుకోవడానికి అవకాశం ఏర్పడింది. ప్రధానంగా నౌకల తయారీ క్లస్టర్లకు ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించడంతో ఇప్పుడు కంపెనీలు దృష్టిసారించి కాకినాడకు రావడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. అటు పాలసీ అమలుకు ఏపీ మారిటైం బోర్డును నోడల్ ఏజెన్సీగా నియమించింది. ఈ కార్యాలయం కాకినాడలో ఉండడంతో భవిష్యత్తులో నౌకా నిర్మాణం పుంజుకోవడానికి అడుగులు పడుతున్నాయి. రూ.300 కోట్లతో ఇక్కడ నౌకా తయారీ కేంద్రం ఏర్పాటుకు అధికారులు తాజాగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తే భారీ పెట్టుబడులు రానున్నాయి. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఉన్న హిందుస్థాన్, కొచ్చిన్, గోవా, మజగావ్ షిప్ యార్డులు 100 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంలో నౌకలను నిర్మిస్తున్నాయి. కాకినాడలో ఐదెకరాల విస్తీర్ణంలోనే భారీ నౌకల తయారీకి సహజసిద్ధ సీఫ్రంట్ వాతావరణం అనుకూలంగా ఉంది. కానీ ప్రోత్సాహం లేక పెట్టుబడులు రాలేదు. నౌకల తయారీ క్లస్టర్లకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించడంతో కాకినాడ కేంద్రంగా ఈ రంగం ఎదిగేలా చేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

వచ్చి.. వెళ్లిపోయాయి..

గతంలో కాకినాడలో నౌకల నిర్మాణం, మరమ్మతులకు షిప్‌యార్డును నిర్మించడానికి సింగపూర్ కంపెనీ ముందుకు వచ్చింది. సీపోర్టులో కొంతకాలం కార్యకలాపాలు నిర్వహించింది. వివిధ దశల్లో రూ.1,725 కోట్ల పెట్టుబడులకు సిద్ధమైంది. కానీ సరైన ప్రోత్సాహం కరువవడంతో ఇక్కడ యార్డును మూసేసింది. ఎల్ అండ్‌టీ కంపెనీ 2006లో కాకినాడలో షిప్ యార్డు నిర్మాణానికి ముందుకు వచ్చింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంది. కానీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో చెన్నైకు వెళ్లిపోయింది. మరోపక్క 2020లో రూ.7కోట్ల కాకినాడ స్మార్ట్‌సిటీ నిధులతో జగన్నాథపురం సమీపంలో అధికారులు బోట్ బిల్డింగ్ యార్డు నిర్మించారు. ఇందులో ఒకేసారి 18 వరకు భారీ బోట్లు తయారుచేసే వసతులు సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో అది ఈసురోమంటోంది.

28 వరకు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపికకు సంబంధించిన కార్యాచరణ ప్రక్రియను ఈనెల 30న తేదీ ప్రకటించడం జరుగుతుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నైపుణ్యం కలిగిన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 28వ తేదీతో ముగుస్తుందన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కన్వీనర్ శ్యాం గంగరాజు, కమిటీ సభ్యులు కాలెపు సత్యసాయిరాం, పల్లా రాంజీ సెల్ నెం. 92994 01222, 63031 39365, 77801 67625 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

జీజీహెచ్ హెల్ప్ డెస్క్‌లో ఇద్దరు సిబ్బంది విధులు

'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని మెయిన్ బ్లాక్ ప్రవేశం వద్ద ఉన్న హెల్ప్ డెస్క్‌లో ఇద్దరు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని ఆర్ఎంవో, డిప్యూటి సూపరింటెండెంట్ దీన్ని పర్యవేక్షిస్తున్నారని ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. "సిబ్బంది ఉండరు ... హెల్ప్ చేయరు" శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ స్పందించారు. రోగుల సౌకర్యార్థం మెయిన్ బ్లాకు వద్ద ఒకటి, ఎంసీహెచ్ బ్లాకులోని గర్భిణీల విభాగంలో మరొకటి మొత్తం రెండు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోగులకు అసౌకర్యం కలగకుండా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ హెల్ప్ డెస్కులో సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు.



పెరవలి స్టేషన్ వద్ద మొక్క నాటుతున్న ఎస్పీ

ఇసుక అక్రమ రవాణా చేస్తే

కఠిన చర్యలు

ఎస్పీ నరసింహకిశోర్

పెరవలి/నిడదవోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహకిశోర్ హెచ్చరించారు. పెరవలి, నిడదవోలు మండలం సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్ రికార్డులను సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఇసుక ర్యాంపుల్లో దళారులపై చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వ్యాపారం చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్సు లేని ఏజెంట్ల వలకు చిక్కుకుని మోసపోతున్నారన్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో క్రైమ్ రేటు తగ్గిందని మిగిలిన చోట్ల కూడా క్రైమ్ రేటు తగ్గే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.పెరవలి పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఆయన వెంట కొవ్వూరు డీఎస్పీ దేవ కుమార్, నిడదవోలు సీఐ తిలక్, పెరవలి, ఉండ్రాజవరం ఎస్ఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, ఎస్పీ సీఐ అనసూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మా భూమెక్కడ!

145 గ్రామాలు..1645 అర్జీలు

- తప్పుల తడకగా జగనన్న భూసర్వే
- ఆన్‌లైన్‌లో భూమి మాయం
- సరిహద్దుల్లోనూ తేడాలు
- రైతుల మధ్య భూ చిచ్చు
- లబోదిబోమంటున్న రైతాంగం
- రెవెన్యూ సదస్సులకు భారీ క్యూ



దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌కు అర్జీ అందజేస్తున్న రైతు

గోకవరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నా భూమి ఎక్కడుందో చూపండి.. ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు.. ఎటుపోయిందో వెతికిపెట్టండి.. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులకు వస్తున్న చాలా ఫిర్యాదులు ఇలాగే ఉంటున్నాయి. గత వైసీపీ పాలనలో భూముల రీ సర్వేలో జరిగిన అక్రమాలు, తప్పులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. భూముల విస్తీర్ణం తగ్గిపోవడం, తమ భూములను ఇతర రైతుల పొలాల్లో చేరిపోయాయంటూ రైతులు అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరగని న్యాయం కూటమి ప్రభుత్వంలో జరుగుతుందని బాధిత రైతాంగం దరఖాస్తులు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున రెవెన్యూ సదస్సులకు తరలివస్తున్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 148 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 1645 అర్జీలను స్వీకరించారు. ఒక్క గోకవరం మండలంలోనే ఇప్పటి వరకు 7 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా వివిధ సమస్యలపై రైతుల నుంచి 104 అర్జీలు అధి కారులకు అందాయి.ఇంకనూ 8 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉంది. అధికారులకు అందిన 104 ఫిర్యాదుల్లో భూమి హెచ్చు తగ్గులు, సర్వే నెంబర్లు మారిపోవడం, తదితర ఇబ్బందులపై అందిన ఫిర్యాదులే అధికం. జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. నల్లజర్ల రెవెన్యూ సదస్సులో 22 మంది అర్జీలు అందజేశారు. కోరుకొండ మండలం జంబూపట్నంలో 10 ఫిర్యాదులు అందాయి. వారసత్వంగా దశాబ్దాలుగా అనుభవిస్తున్న భూముల కొలతల్లో తేడాలు రావడం, అనుభవం కింద ఉన్న భూమిని ఇతరుల పేరిట రికార్డుల్లో చూపడం వంటి అంశాలు కూడా రైతుల మధ్య చిచ్చు పెట్టే విధంగా మారాయి. వారసత్వంగా వచ్చిన, కొన్న భూములు సాగు చేసుకొంటూ ప్రశాంతంగా జీవిస్తుంటే రీసర్వే పేరిట తాము పొలం వద్ద లేకున్నా సర్వే చేసి రాళ్లు పాతడం, భూమి రికార్డుల్లో కన్నా తక్కువగా చూపడం వంటి అక్రమాలకు గత వైసీపీ ప్రభుత్వ హ యాంలో పలువురు రెవెన్యూ సిబ్బంది తెరలేపారని పలువురు బాధిత రైతులు వాపోతున్నారు.

అవినీతికి ఊతం..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూరీ సర్వే కొంతమంది రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం కురిపించిందనే ఆరోపణలు ఉన్నాయి. పొలంలోకి వెళ్లకుండానే గ్రామాల్లో ఏదో ఒక చోట కూర్చోని సర్వే చేసినట్టు చూపించి, ఆ తరువాత కావాలనే తప్పుడు కొలతలు వేశారనే విమర్శలు లేకపోలేదు.ఈ క్రమంలో బాధిత రైతుల ఆందోళన,ఆవేదనను కొంతమంది సిబ్బంది ముందుగా క్యాచ్ చేసి.. ఆ తరువాత క్యాష్ చేసుకున్నారనే అపవాదులు గట్టిగా వినిపిస్తున్నాయి. రికార్డులో ఉన్న తప్పులను తిరిగి వారే పరిష్కరించి రైతుల నుంచి భారీగా దోచుకుంటున్నారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికీ ఈ తతంగం కొనసాగుతూనే ఉన్నట్టు బోగట్టా. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ఇద్దరు, ముగ్గురు వీఆర్వోల పాత్ర ఉన్నట్టు సమాచారం. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



రాజమహేంద్రవరంలో ఎంపీ పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

ఎంపీ పురందేశ్వరికి సంఘం నాయకుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించడంపై సీఎం చంద్రబాబుతో మాట్లాడతానని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఏపీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్, ఉద్యోగాలు కోల్పోయిన ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు ఎంపీ పురందేశ్వరిని సోమవారం రాజమహేంద్రవరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలు పోవడంతో వందల మంది హెల్త్ అసిస్టెంట్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉద్యోగాలు పోయిన బాధతో నాలుగు రోజుల వ్యవధిలో ముగ్గురు చనిపోయిన విషయాన్ని వివరించామన్నారు. దీనిపై స్పందించిన పురందేశ్వరి న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారని వెల్లడించారు.

రైతులను గౌరవంగా చూడాలి

రైతు దినోత్సవంలో కేవీకే హెడ్ నాయుడు

రాజానగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ అభివృద్ధిలో రైతులు కీలకపాత్ర పోషిస్తున్నారని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పేర్కొన్నారు. కలవచర్ల కేవీకేలో సోమవారం జాతీయ రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.దేశ శ్రేయస్సుకు రైతులు పునాది అన్నారు.ఉద్యాన పంటల అధికారి జేవిఆర్ సత్యవాణి వ్యవసాయ శాస్త్రవేత్తల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతుల శ్రమ దేశాన్ని పోషిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిలబెడుతుందన్నారు.ఇది ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. రైతులను ప్రతి ఒక్కరూ గౌరవంగా చూడాల న్నారు. అన్నం పెట్టే రైతన్న లేకపోతే ఆకలి తీరదన్నారు. అన్నదాత ఆరుగాలం కష్టపడితేనే మన కడుపు నిండుతుందని తెలిపారు. రైతు కుటుంబంలో పుట్టడం ఈ ప్రాంత యువత చేసుకున్న అదృష్టమన్నారు. రైతు సేవకు గుర్తింపుగా చల్లా నాగన్న అనే అభ్యుదయ రైతును సత్కరించారు.ఈ సందర్భంగా హాజరైన రైతులకు కృషి విజ్ఞాన కేంద్రంలో నువ్వుల పంట సాగుపై శిక్షణ ఇచ్చారు. ప్రత్యామ్నాయ పంటలే లాభదాయకంగా ఉంటాయన్నారు. రాజానగరంలోని దివ్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర ప్రదర్శన చేశారు.ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన విభాగం అధికారి సంజయ్ హెగ్డే, చేపల విభాగాధికారి రవీంద్ర పొంటెక్కే, కేవీకే పశుసంవర్థక అధికారి బి.నాగేశ్వరరెడ్డి, సస్యరక్షణ అధికారి రఘునందన్, తదితర రైతులు పాల్గొన్నారు.



8

రూ.2.5 కోట్లు రోడ్డు పాలు

9 నెలలకే గోతులమయం



రెండున్నర కోట్లు రోడ్డుపాలు!

9 నెలల్లోనే పాలపురం-దొండపూడి రహదారికి పగుళ్లు




నాణ్యతాలోపం కారణంగా పగుళ్లు తీసిన గోపాలపురం-దొండపూడి రహదారి

గోపాలపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండున్నరకోట్ల ఖర్చు. 9నెలల కాలం వెరసి నాణ్యతాలోపంతో గోపాలపురం-దొండపూడి రహదారి పగుళ్లు తీసింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన గోపాలపురం నుంచి దొం డపూడి వెళ్లే సుమారు 12.5కిలోమీటర్ల రోడ్డుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి హోం మంత్రి..గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా వచ్చిన వెంటనే ఆగమేఘాల మీద గోపాలపురం, దొండపూడి రహదారి నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆ రహదారిలో సుమారు 20 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఎన్నికల్లో ఎలాగైనా వారి మెప్పు పొంది ఓట్లు సంపాదించాలన్న ఉద్దేశంతో యుద్ధ ప్రాతి పదికన రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే పనులు లోపభూయిష్టంగా జరుగుతున్నాయని గ్రహించినా ఏ ఒక్కరు నోరు మెదపలేదు. ఇన్‌చార్జిగా రాగానే రోడ్డు నిర్మించామని జబ్బలు చరుచుకున్న అప్పటి పాలకులు ప్రజలనైతే మైమరపించారే తప్ప అటు ఓట్లు పడలేదు. రోడ్డు నిర్మించిన 9 నెలల్లోనే నాణ్యతా లోపం కారణంగా రోడ్డు ఎక్కడికక్కడ పగుళ్లు తీసింది.

అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి

డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో రాణి సుస్మిత ▸ 10 అర్జీల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : డివిజనల్ స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి ధరఖాస్తుదారులకు సత్వర న్యాయం అందజేయాలని ఆర్డీవో రాణిసుస్మిత అధికారులకు సూచించారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 10అర్జీలు స్వీకరించామన్నారు. అర్జీల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో సోమవారం పీజీఆర్ఎస్ జరుగుతుందని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను డివిజన్, జిల్లా స్థాయిలో అర్జీలు అందించి పరిష్కరించుకోవాలన్నారు.కార్యక్రమంలో కె.రవివిక్రమ్, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

పోతవరం హైస్కూల్లో గణిత అవధానం



గణిత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న దృశ్యం

నల్లజర్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పోతవరం జడ్పీ హైస్కూల్లో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 8వ తరగతి విద్యార్థి మోహన్ కృష్ణ 8మంది విద్యార్థులతో నిర్వహించిన గణిత అవధానం అలరించింది. హెచ్ఎం గోపిగోవర్ధన్ మాట్లాడుతూ గణితంపై పట్టుసాధిస్తే జీవితానికి వెలుగునిస్తుందన్నారు.విద్యార్థులు రామానుజన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు బాల సుబ్రహ్మణ్యంను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మిప్రసన్న, అన్నెర రమాదేవి పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి బీమా సాయం



ప్రమాద బీమా సాయం అందజేస్తున్న రామారావు

కొవ్వూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో పాటు జనసైనికులకు పార్టీ అండగా ఉంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జనసైనికుని కుటుంబానికి ప్రమాదబీమా చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామానికి చెందిన దుళ్ల మాణిక్యాలరావుకు జూన్ 4న సీతంపేట పవర్ ప్లాంట్ వద్ద జరిగిన ప్రమాదంలో తలకు గాయ మైంది. అతడు జనసేన క్రియాశీల సభ్యత్వం కలిగి ఉండడంతో జనసేన పార్టీ కార్యాలయం నుంచి మంజూరైన రూ.50 వేల ప్రమాద బీమాను మాణిక్యాలరావు కుమారుడు పోసిబాబుకు రామారావు అందజేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా సెక్రటరీ మారిశెట్టి వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు సుంకర సత్తిబాబు, కంఠంశెట్టి సత్యనారాయణ, శ్రీరంగం శివ, రేకపల్లి పవన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల విద్యాసంస్థలో ఇన్‌స్పైర్-2024



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ ఐజేటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్, ఎన్ఐటీ తదితర విద్యాసంస్థల్లో తిరుమల విద్యాసంస్థలకు చెందిన 627 మంది విద్యార్థులు ప్రవేశాలు సాధించడం చిన్న విషయం కాదని కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని కాతేరు శివారు తిరుమల విద్యాసంస్థల్లో సోమవారం సాయంత్రం ఇన్‌స్పైర్-2024 పేరుతో ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్, ఎన్ఐటీలలో ప్రవేశాలు సాధించిన విద్యార్థులను అభినందించేందుకు తిరుమల సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఐటీ, డాక్టర్స్, ఇంజనీర్లుగా మన దేశ పౌరులు విదేశాల్లో విజయవంతంగా పనిచేయగలుగుతున్నారంటే బేసిక్ స్థాయిలో వారికి అందిన నాణ్యమైన విద్యే కారణమన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తిరుమల బృందం ఎనలేని కృషి చేసిందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు దేశం గర్వించదగ్గ విద్యాసంస్థల్లో సీట్లు సాధించినవారంతా తిరుమల విద్యార్థులేనన్నారు.

పాముకాటు..
ఆవు,దూడ మృతి




పాముకాటుతో మృతి చెందిన ఆవు, దూడ

గోపాలపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో తన ఆవు, దూడ మృతి చెందినట్టు పెద్దాపురం గ్రామానికి చెందిన రైతు కొర్లపాటి అన్నవరం సోమవారం తెలిపారు. అన్నవరానికి చెందిన ఆవు, దూడ మధ్యాహ్నా గడ్డి మేస్తుండగా పాము రెండింటినీ కాటు వేయడంతో కుప్పకూలిపోయాయి. మందు కోసం ఆసుపత్రికి వెళ్లినప్పటికీ మందు దొరకకపోవడంతో పశుసంవర్థక శాఖ సిబ్బంది ప్రథమ చికిత్స అందించినప్పటికి ఫలితం లేకపోయింది. దీంతో రూ.లక్ష విలువైన ఆవు, దూడ మృతి చెందాయని ఆవేదన వ్యక్తంచేశారు. పాముకాటుకు గురైన ఆవు, దూడకు వైద్యం అందించడానికి మనుషులకు సంబంధించిన వ్యాక్సిన్ వాడాల్సి ఉండగా వ్యాక్సిన్ ఇవ్వాలని గోపాలపురం, అన్నదేవరపేట, కొయ్యలగూడెం ఆసుపత్రులకు వెళ్లి మందు అడగగా డాక్టర్లు నిరాకరించారని రైతు చెప్పాడు. ఎవరైనా పాముకాటుకు గురైతే అత్యవసర పరిస్థితిలో వాడే వ్యాక్సిన్ అందుబాటులో లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని డాక్టర్లు పేర్కొన్నారన్నారు. ఎట్టకేలకు రాజమండ్రిలో వ్యాక్సిన్ లభించినప్పటికీ సకాలంలో అందక రెండూ మృతి చెందాయని బాధిత రైతు అన్నవరం చెప్పాడు.

దీపక్‌రాజ్‌కు గరికపాటి అవార్డు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ రచయిత దీపక్ రాజ్‌కు గరికపాటి కళాకౌముది అవార్డు లభించినట్టు ప్రజసాహితి పుల్లెపు తాతయ్య మెమోరియల్ సంస్థ (పీటీఎం) వ్యవస్థాపకుడు పుల్లేల వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజరుగా పనిచేసిన దీపక్ రాసిన మన కోనసీమ కథలకు అవార్డుకు ఎంపికయ్యారన్నారు.

కొవ్వూరు అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే ముప్పిడి
- తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం
- అధికారులు ప్రొటోకాల్ మరిచి పోతున్నారు: ఎంపీపీ పోసిరాజు



తాళ్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసేలా, ఎప్పటికప్పుడు వారి డబ్బులు కూడా ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకున్నామని, రానున్న రోజుల్లో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు తమ శాఖల పని తీరును వివరించారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు మాట్లాడుతూ అధికార పార్టీ మారింది కానీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎన్నికల ద్వారానే అధికారంలోకి వచ్చారనే విషయాన్ని అధికారులు మరచిపోవద్దని, కొన్ని కొన్ని సమయాల్లో ప్రొటోకాల్ మరచిపోతున్నారని అన్నారు. ఎంపీటీసీ చిన్నబ్బాయి మాట్లాడుతూ గజ్జరం గ్రామంలో సారా తయారీ, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రక్కిలంక-గజ్జరం రహదారిలో పాత ఇనుప సామాన్ల షాపుల వారు రాగి వైరు కోసం ప్లాస్టిక్ వైర్లు రోడ్డు మీదే కాల్చుతున్నారని, వాటి నుంచి వచ్చే పొగతో పాదచారులు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కాలుష్యం పెరిగిపోతుందని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, డీటీ భారతి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రక్కిలంకలోని రెండు కుటుంబాలకు ఎమ్మెల్యే ముప్పిడి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ వాటిక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గర్భిణులు, బాలింతలకు ఆకు కూరలను అందించారు. సీడీపీవో మమ్మీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఆకు కూరలు పండించి వారానికి రెండు సార్లు పిల్లలకు భోజనంలో పెడుతున్నామన్నారు. ఇందుకోసం తమ శాఖ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.10 వేల చొప్పున అందిస్తున్నామని, తమ కేంద్రాల్లోనే సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలు పండించాలన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, మాజీ ఎంపీపీ కోట్నీస్, కోడి శంకరం, నాయుడు హనుంతరావు, ఉప సర్పంచ్ జగదీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యకుమారి, భానుమతి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

కొవ్వూరు, డిసెంబరు 23: పేదల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ రోగాలతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి, ఎన్టీఆర్ వైద్యసేవ కింద కూటమి ప్రభుత్వం సేవలందిస్తోందన్నారు. ఇటీవల నియోజకవర్గంలో 10 మందికి రూ.6,11,000 మంజూరయ్యాయని, వారిలో పశివేదలకు చెందిన దండు లక్ష్మికి రూ.1,87,368, యలమాటి నాగవల్లి తాయారుకు రూ.35,000, గాది రాజుకి రూ.30,000 చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురై వైద్యానికి ఆర్థిక స్తోమత లేని పేదలకు సహాయం చేయడానికే సీఎంఆర్ఎఫ్ ఉందన్నారు. కార్యక్రమంలో కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, వేమగిరి వెంక్రటావు, బేతిన నారాయణ, పెనుమాక జయరాజు, తుంపల్లి అదినారాయణ, కురుకూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

దంత వైద్యులకు భారత్ పుట్టినిల్లు

- ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి
- ఘనంగా జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు ప్రదానం చేస్తున్న ఎంపీ పురందేశ్వరి.. చిత్రంలో ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, గన్ని భాస్కరరావు

రాజానగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక దంత వైద్యులు కలిగిన దేశం భారతదేశమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. జీఎస్ఎల్ దంతవైద్య కళాశాల 7వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను సోమవారం శ్రుత హాల్లో జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భారత్‌లో మానవవనరులు పుష్కలంగా ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వైద్య విద్యార్థులకు సూచించారు. డబ్ల్యూహెచ్‌వో గణాంకాల ప్రకారం ప్రతి 7 వేల మందికి ఒక దంత వైద్యులుండగా, ఇండియాలో ప్రతి 5వేల మందికి ఒక దంత వైద్యుడున్నారన్నారు. తమ చిన్న తనంలో దంత వైద్యులపై ఒకింత చులకన భావం ఉండేదని, ప్రస్తుత రోజుల్లో దంత వైద్యం ఎంతో ప్రాచుర్యం సంతరించుకుంటోందన్నారు. మనుషుల్లో దంత సంబంధ సమస్యలే అధికంగా ఉంటున్నాయని ఎంపీ అన్నారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించడంతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని వైద్య కళాశాలల ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. యువ వైద్యులు సేవా దృక్పథంతో సేవలందించాలన్నారు. మరో ముఖ్యఅతిథి రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ వైద్య రంగంలో ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిడులను అధిగమిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దంతవిద్యను పూర్తిచేసిన యువ వైద్యులకు పట్టాలు ప్రదానం చేశారు. అలాగే ముఖ్య అతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, డాక్టర్ తరుణ్, మెడికల్ సూపరింటెం డెంట్ టీవీఎస్‌పీ మూర్తి, ప్రిన్సిపాల్ గంటా సునీల్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.


సోమేశ్వరుడి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిడదవోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అనఘాష్టమి సందర్భంగా కాలభైరవ స్వామికి, దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో అనఘాష్టమి వ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాళ్లపూడిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

తాళ్లపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి సెయింట్ యూజిన్ పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్ సగాయారాజ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్ జోసెఫ్, పద్మావతి, భవానీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కొవ్వూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన ఉడత వరలక్ష్మి ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నాం 2గంటలకు తన కుమార్తె చదివే పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో వరలక్ష్మి భర్త లక్ష్మీసురేష్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కాంట్రాక్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో పాలియాటివ్ కేర్ ప్రోగ్రామ్‌లో పనిచేయడానికి ఒక జనరల్ ఫిజీషియన్/వైద్యాధికారి, ముగ్గురు స్టాఫ్ నర్సుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఈ పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తులు జనవరి 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు బొమ్మూరులోని జిల్లా వైద్యశాఖాధికారి వారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నియామకాలు పూర్తి మెరిట్ ప్రాతిపదికన పారదర్శకంగా జరుగుతాయని, మరిన్ని పూర్తి వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

నివాసయోగ్యంగా లేని ఇళ్ల స్థలాలిచ్చారు

- వాటిని రద్దు చేసి అనువైన చోట ఇవ్వండి
- తహశీల్దార్‌కు లబ్ధిదారుల వినతి
- పలుచోట్ల రెవెన్యూ సదస్సులు



నల్లజర్లలో వినతిపత్రం అందిస్తున్న రైతు నారాయణ

దేవరపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ధూమంతనగూడెంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు చినుకు పడితే ముంపుకు గురయ్యే ప్రాంతాల్లో ఇచ్చారని, నివాసయోగ్యంగా లేవని ధూమంతనగూడెం, కృష్ణంపాలెం గ్రామాల లబ్ధిదారులు అన్నారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ మేరకు తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు గుడిసే పోసి వెంకటరత్నం, పళ్ళంట్ల పాండు, ఐనాల నరసింహమూర్తి, చాపల నాగరాజులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పోలవరం కాల్వ గట్టు దిగువ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని,అవి ఇళ్లు నిర్మించుకోవడానికి అనుకూలంగా లేవని, ఆ స్థలాలను రద్దు చేసి అనువైనచోట కేటాయించాలని కోరారు. రెవెన్యూ సదస్సులో ప్రధానంగా రీసర్వే, ఇళ్ల స్థలాలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరంగం రామలక్ష్మి, ఎంపీటీసీ సత్తి జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్లలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 22మంది రైతులు డిప్యూటీ తహశీల్దార్ శాంతి ప్రియకు అర్జీలు సమర్పించారు. రీసర్వేలో తమ భూమి ఆన్‌లైన్‌లో లేకుండా పోయిందని, పట్టాదారు పాస్‌బుక్ రాలేదని, సర్వే చేయించి తమ భూమి అన్‌లైన్‌లో ఎక్కించాలని తదితర సమస్యలను అర్జీల్లో పేర్కొన్నారు. సదస్సులో వీఆర్వోలు సురేష్, చంద్రబాబు, సామ్యూల్, రాంబాబు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశానికి అనుమతివ్వండి

జిల్లా కలెక్టర్‌కు అస్సాగో పరిశ్రమ బాధితుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

గోకవరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 28న తలపెట్టనున్న అఖిలపక్ష సమావేశానికి అనుమతివ్వాలని కోరుతూ మండలంలోని గుమ్మళ్లదొడ్డి అస్సాగో పరిశ్రమ బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అస్సాగో కంపెనీపై నివేదిక సమర్పించాలని తమ సమక్షంలో ఆదేశించినట్టు బాధితులు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశానికి అనుమతి కోరుతూ వెళ్లిన తమకు తగిన భరోసా కల్పించారని, త్వరలో గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినటుట తెలిపారు. తమ గ్రామంలో విధించిన పోలీస్ ఆంక్షలను సడలించి, మానవ హక్కులను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నివేదికకు ఎదురుచూపు

గుమ్మళ్లదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన అస్సాగో పరిశ్రమ వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బంది లపై గతంలో స్థానికులు భారీ ఎత్తున పలు అం దోళన కార్యక్రమాలు చేపట్టారు. దీనిపై స్పందిం చిన జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారుల సమన్వయంతో, గ్రామస్థుల భాగస్వామ్యంతో కమిటీని ఏర్పాటుచేసి 45 రోజుల్లో నివేదిక సమర్పిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఇచ్చిన గడువు ముగియడంతో నివేదికను బహిర్గతం చేయాలని బాధితులు కోరుతున్నారు.

లే నాన్నా.. ఇంటికెళ్లిపోదాం!

- తల్లి కళ్లెదుటే కుమారుడు మృతి
- కన్నీటి పర్యంతమైన మాతృమూర్తి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకూ అమ్మతో ఉన్నాడు.. కబుర్లు చెప్పుకుంటూ ఇద్దరూ ఆనందంగా బైక్‌పై వెళుతున్నారు. ఇంతలో ఒక లారీ అడ్డుగా వచ్చింది.. అంతే అమ్మ అంటూ రోడ్డుపై అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. తల్లి లే నాన్నా వెళ్లిపోదాం అన్నా కదలికలేదు. దీంతో తల్లి బోరునవిలపించిన హృదయవిదారక ఘటన ఇది. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎల్.నరేష్ (20) తన తల్లి సత్యవతితో కలిసి బ్యాంక్ పని నిమిత్తం బుల్లెట్‌పై మోరంసెంటర్‌కు బయలు దేరారు. పిడింగొయ్యి జాతీయ రహదారి సెంటర్ వద్ద మలుపులోకి వచ్చే సరికి లాలాచెరువు వైపు నుంచి వస్తున్న టిప్పర్ డ్యాష్ ఇచ్చింది. దీంతో బుల్లెట్ అదుపు తప్పి సత్యవతి కిందపడిపోగా నరేష్ మాత్రం ఆ బండి ట్యాంక్, హ్యాండిల్‌కు చాతితో గుద్దుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే సత్యవతి లేచి స్థానికుల సహకారంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అయితే పరిస్థితి విషమించి నరేష్ మృతి చెందాడు. సత్యవతి భర్త గతంలోనే మరణించారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.నరేష్ చిన్నకుమారుడు. కుమారుడి మృతదేహాన్ని పట్టుకుని తల్లి రోధించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.